
PDF Compressor Free Version

Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 20.12.2013, శుక్రవారం సంపుటి : 33 సంచిక : 29 పేజీలు : 12, వెల : ₹ 4




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com



## అన్నా... ఇది నీ పుణ్యమే!

• గట్టెక్కిన లోక్‌పాల్ బిల్లు

**సమాజంలో నెలకొన్న ఏ చెడునైనా రూపుమాపాలంటే ఏదో ఒక పాయింట్ వద్ద ప్రక్రియ మొదలుపెట్టాలి. దేశమంతా అవినీతి చెద పాకిపోయింది. దీనిని నిర్మూలించాలంటే రెండు పద్ధతులున్నాయి.**

ఒకటి క్రిందిస్థాయి నుండి పైస్థాయి వరకు సంస్కరించుకుంటూ రావడం. అంటే ప్రజలు ముందు నీతిమంతులుగా వుండడం. ఎక్కడా అవినీతిని ప్రోత్సహించకుండా వుండడం. ప్రజలతో మొదలై క్రింది స్థాయి ఉద్యోగుల నుండి అధికారులు, ఉన్నతాధికారులు, వారిపై రాష్ట్రస్థాయి అధికారులు, సంబంధితశాఖల మంత్రులు... ముఖ్యమంత్రులు... కేంద్రమంత్రులు... ప్రధానమంత్రి... ఇదీ మొదటి పద్ధతిలో వరుస. ఎవరికివాళ్లు నీతిమంతులుగా మారడం అన్నమాట. 120కోట్ల భారతావనిలో అవినీతిని అంతమొందించాలంటే ఈ పద్ధతిలో కుదరదు. ఎందుకంటే ఇన్ని కోట్లమందిని ఒక దారిలోకి తేవడం చాలాకష్టం. దానికి రెండో పద్ధతి ఉంది. అవినీతి నిర్మూలనకు ఓ చట్టం తేవడం, ఈ చట్టంలో ప్రధాని నుండి సాధారణ ప్రజల వరకు అందరినీ బంధించడం. ప్రధాని నీతిగా ఉంటే అతని క్రిందమంత్రులు నీతిగా పని చేస్తారు. మంత్రులు లంచాలు తీసుకోకుండా గట్టిగా ఉంటే వారి క్రింద అధికారులకూ భయం ఉంటుంది. పైస్థాయిలో అధికారులు నిజాయితీతో వుంటే ఆటోమేటిక్‌గా క్రిందిస్థాయి సిబ్బంది కూడా కొంతవరకు అవినీతి మార్గం నుండి తప్పుకుంటారు. ఈ దేశంలో సంస్కరణల ద్వారా నీతిని పాదుకొల్పాలంటే కష్టమే. ఆ పరిస్థితి ఎప్పుడో చేయిదాటిపోయింది. ఇక ఉన్నమార్గం చట్టం ద్వారా అవినీతిపరులకు భయం పెట్టడమే.

అలాంటి చట్టమే ఈరోజు పార్లమెంటు వాకిలి దాటింది. సామాజిక యోధుడు అన్నాహజారే పోరాటం ఫలించింది. లోక్‌పాల్ (మిగతా 10వ పేజీలో)



**సమైక్యాంధ్ర విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డిని అందరూ పవర్‌స్టార్ పవన్‌కల్యాణ్ లాంటి పవర్‌ఫుల్ హీరో అనుకున్నారు. రాష్ట్ర విభజన విషయంలో ఆయన డైలాగ్‌లు డైనమేట్లుగా పేలాయి. కాంగ్రెస్ అధిష్ఠానం గుండెల్లో బద్దలు కొట్టాయి. ధీరుడు, వీరుడు మన కిరణ్ అని అందరూ మెచ్చుకున్నారు.**

## తెలంగాణపై "కీ"రన్ మ్యాచ్ ఫిక్సింగ్


### మాటల్లో వావ్... చేతల్లో మ్యావ్

రాష్ట్ర విభజనను ఎట్టి పరిస్థితుల్లోనూ అడ్డుకుంటానన్న రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డి మాటలను అందరూ నమ్మారు. కిరణ్ ఏదో ఒకటి చేసి తెలంగాణబిల్లును ఆపుతాడని సీమాంధ్ర జనాలకు నిన్నటిదాకా నమ్మకం వుండింది. కాని బిల్లు రాష్ట్ర శాసనసభకు వచ్చే సరికి ఆయన బండారం బయటపడింది. ఆయన పవర్‌స్టార్ పవన్‌కల్యాణ్ లాంటి హీరో కాదని అల్లరి నరేష్ లాంటి కామెడీ హీరో అని తేలిపోయింది.

కాంగ్రెస్ అధిష్ఠానం స్క్రీన్‌ప్లే, డైరక్షన్, మాటలు, పాటలు... అన్నీ తానై సాగిస్తున్న విభజన నాటకంలో కిరణ్ కూడా ఓ పాత్రధారి అని తేలిపోయింది. ఈ నాటకంలో ఏ పాత్ర స్వభావం ఏంటనేది ముందుగానే తెలిసింది. అలాగే కొన్ని పాత్రలు సమాజం ముందు మంచిగా కనిపిస్తాయి. నాటకం క్లైమాక్స్‌కొచ్చేసరికి వారి విలనిజం బయటపడుతుంది. ఇప్పుడు విభజన నాటకం కూడా ముగింపు దశకు వచ్చేసరికి కిరణ్ విశ్వరూపం బయటపడింది. ఎట్టి పరిస్థితుల్లోనూ రాష్ట్ర విభజనను అడ్డుకుంటానని ప్రగల్భాలు పలికిన కిరణ్ అదే విభజనకు మార్గం సుగమం చేసాడు.

కాంగ్రెస్ అధిష్ఠానాన్నే ధిక్కరిస్తూ, రాష్ట్ర విభజనపై నిన్నటివరకు మొండిగా వున్నా ఒక్కసారిగా అధిష్ఠానానికి ఎందుకు బెండ్ అయినట్లు అనే సందేహాలు వెల్లువెత్తుతున్నాయి. అధిష్ఠానం చెప్పిన ప్రకారమే ముఖ్యమంత్రి నడుచుకుంటూ వచ్చాడనేది ఒక వాదన. కిరణ్‌కు సీఎం పదవి ఇచ్చేటప్పుడే తెలంగాణ అంశాన్ని చెప్పారని, మీ హయాంలోనే రాష్ట్ర విభజన జరుగుతుందని అధిష్ఠానం చెప్పినట్లు వినికిడి. దానికి అంగీకరించే ఆయన సీఎం పదవి చేపట్టారు. అయితే విభజన నిర్ణయం తీసుకున్నాక, ఎవరో ఒకరు పార్టీ తరపున సమైక్యాంధ్రకు మద్దతుగా గట్టిగా నిలవాలి కాబట్టి ఆ బాధ్యతను కిరణ్‌కు అప్పగించారని, దాని ప్రకారమే కిరణ్ నడుచుకున్నాడనేది టాక్. బిల్లు శాసనసభకు వచ్చేసరికి కిరణ్ చేతులెత్తేయాలన్నది అధిష్ఠానం నాటకంలో ఓ భాగమే. కిరణ్ స్వతహాగానే క్రికెటర్ కాబట్టి అధిష్ఠానం ఆయనతో ఈ విధంగా మ్యాచ్‌ఫిక్సింగ్ చేసుకున్నట్లు సమాచారం.

ఇంకో రెండోవాదం చూద్దాం. కిరణ్ సమైక్యాంధ్రవాదంపై గట్టిగానే నిలబడ్డాడు. అయితే ఇటీవల దిగ్విజయ్‌సింగ్ హైదరాబాద్ వచ్చి పోయాకే కిరణ్‌లో మార్పు వచ్చింది. ఇక్కడ చిన్న సినిమా సంఘటన చూద్దాం. ఓ నిజాయితీ పోలీస్ ఆఫీసర్ ఎవరికీ తలవంచకుండా పనిచేస్తుంటాడు. ఓ పెద్ద స్మగ్లింగ్ ముఠాను పట్టుకుని పోలీసుస్టేషన్‌లో పెడతాడు. వాళ్లను విడిపించమని స్మగ్లర్ డాన్ ఫోన్ చేస్తాడు. కనిపించే మూడు సింహాలు చట్టానికి, న్యాయానికి, ధర్మానికి ప్రతిరూపాలైతే కనిపించని ఆ నాలుగో సింహమేరా ఈ పోలీస్... ఏం పీక్కుంటావో పీక్కో (మిగతా 10వ పేజీలో)





## పట్టాలెక్కిన... తెలంగాణ ఎక్స్‌ప్రెస్

- అసెంబ్లీలో చర్చకొచ్చిన బిల్లు
- సభావేదికపై ఇరుప్రాంతనేతల కొట్లాట



కేంద్రం అనుకున్నదే చేస్తుంది. రాష్ట్ర విభజన కోసం మంకుపట్టుదలతో పనిచేస్తుంది. నిజంగా కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వం ఏ.పీ విభజనపై పెట్టిన శ్రద్ధ ఈ పదేళ్లు మంచి పరిపాలన అందించడంపై పెట్టివుంటే కాంగ్రెస్‌పార్టీ ఇంకోసారి కూడా అధికారంలోకి వచ్చి ఉండేదేమో?

ఆంధ్రప్రదేశ్‌ను రెండుముక్కలు చేయాలని ఇటలీ నుండి దిగుమతి అయిన మహారాణి సోనియాగాంధీ తలచిందే తడవు ఆఘమేఘాల మీద ఆ పనులు జరిగిపోయాయి. రాణిగారు తలుచుకుంటే కొరడా దెబ్బలకు కొదవలేదన్నట్లు సోనియా అనుకోగానే రాజ్యాంగ నిబంధనలు కూడా పక్కకు నెట్టేసి కేంద్రంలోని పెద్దలు (మిగతా 10వ పేజీలో)



PDF Compressor Free Version





శేషాచలం అడవుల్లో దాదాపు 150మంది ఎర్రచందనం స్మగ్లర్లు, కూలీలు స్వైరవిహారం చేసి ఇద్దరు అటవీశాఖాధికారులను హతమార్చడంతో పాటు పలువురు సిబ్బందిని గాయపరచడం విస్మయం గొలుపుతుంది. అటవీశాఖలో నెలకొన్న భద్రతా వైఫల్యాలను ఈ సంఘటన తేటతెల్లం చేస్తుంది. ప్రభుత్వ నిర్లక్ష్యవైఖరి మూలంగానో, లేక స్మగ్లర్లకు పైస్థాయిలో వున్న సంబంధాల దృష్ట్యానో ఎర్రచందనం అక్రమరవాణాకు కళ్లెం వేయలేకపోతున్నారు. అడపాదడపా దాడులు చేసి అరకొర ఎర్రచందనాన్ని పట్టుకుంటున్నా పూర్తిస్థాయిలో దీని స్మగ్లింగ్‌ను అరికట్టలేకపోతున్నారు.

# మనమెంత భద్రం

## జిల్లాలోనూ ఆగని ఎర్రచందనం స్మగ్లింగ్

ప్రపంచంలోనే ఎర్రచందనం మన రాష్ట్రంలోనే దొరుకుతుంది. అది కూడా వెలుగొండ అడవుల్లోనే ఎక్కువగా వుంది. చిత్తూరుజిల్లా నుండి కర్నూలు, మహబూబ్‌నగర్ జిల్లాల్లో విస్తరించిన వెలుగొండ, నల్లమల అడవుల్లో ఎర్రచందనం విరివిగా లభిస్తుంది. ఎర్రచందనం అక్రమరవాణా జరిగే జిల్లాల్లో చిత్తూరు తర్వాత నెల్లూరు జిల్లా కూడా వుంది. వెంకటగిరి నుండి ఉదయగిరి వరకు జిల్లా పరిధిలోని వెలుగొండ అడవుల్లో ఎర్రచందనం చెట్ల నరికివేత యథేచ్ఛగా జరుగుతుంది. వెంకటగిరి, డక్కిలి, రాపూరు, ఆత్మకూరు, మర్రిపాడు, ఉదయగిరి, సీతారాంపురం అటవీ పరిధిలో ఎర్రచందనం దొరుకుతుంది. కొందరు స్మగ్లర్లు స్థానికంగా వుండే కూలీలకే ఎక్కువ డబ్బు ఆశచూపి ఎర్రచందనం చెట్లను కొట్టిస్తుంటారు. అడవుల్లో నుండి మొదట సురక్షితంగా వున్న ప్రాంతాలలోకి దుంగలను తరలిస్తారు. అక్కడ నుండి నిర్ణయించిన సమయంలో ఆ దుంగలను వాహనాలలో ఎక్కించి అడ్డదారుల్లో చెన్నైకి తరలిస్తుంటారు. ఎర్రచందనం వాహనాలకు కొందరు పైలట్లుగా వ్యవహరిస్తూ, దారిలో చెకింగ్ వుండేది లేనిది చూసుకుంటూపోతారు. ఈమధ్యకాలంలో ఎర్రచందనం వాహనాలను అటవీశాఖాధికారులు ఛేజ్‌చేసి పట్టుకున్న సందర్భాలు కూడా వున్నాయి.

అయితే ఎర్రచందనం స్మగ్లర్లను ఇప్పటివరకు ఒక కోణంలో చూస్తూ వచ్చారు. ఎంత స్మగ్లింగ్ చేస్తున్నా అటవీశాఖాధికారులు, సిబ్బందిని చూడగానే స్మగ్లర్లు వాహనాలు వదిలేసి పారిపోయేవాళ్ళు. కాని తిరుమల సంఘటనతో మన జిల్లాలోనూ అటవీశాఖ సిబ్బంది అప్రమత్తంగా వుండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక అడవులలోకి కూంబింగ్‌కు వెళ్లేటప్పుడు అటవీసిబ్బంది ఆయుధాలతోనే వెళ్లాలి. స్మగ్లర్లు ఎంతకైనా తెగిస్తుండడంతో అటవీశాఖతో పాటు పోలీసుశాఖ కూడా స్మగ్లింగ్ నిరోధానికి కలిసి పనిచేయాల్సివుంది. ఈ రెండు శాఖలు సమన్వయంతో, పరస్పర సహకారంతో కఠినంగా పనిచేస్తేనే ఎర్రచందనం అక్రమరవాణాను అరికట్టగలవు.

## • దారిలోపడ్డ జిల్లా వైకాపా నేతలు

# విభేదాలకు స్వస్తి... ప్రత్యర్థులతో కుస్తీ





బెత్తం పట్టుకునే అయ్యోరు వస్తేనే పిల్లలు అల్లరిమాని పుస్తకాలు పడతారు. రాజకీయాల్లో కూడా అంతే. కనుసైగలతో కదిలించగల నాయకత్వం ఉంటేనే నాయకులు దారిలో ఉంటారు. లేకుంటే ఎవరిదారిలో వాళ్లుంటారు.


జగన్ చంచల్‌గూడ జైలులో ఉన్న 16నెలలు జిల్లాలోనే వైయస్సార్ కాంగ్రెస్ నేతలు ఎవరి దారి వారిదే అన్నట్లు వ్యవహరించారు. వర్గ విభేదాలతో రెచ్చిపోయారు. తమ ముఠాపోరును వీధులకెక్కేలా చేసారు. ఎవరికివాళ్లు మా చేతుల్లోనే పార్టీ నడుస్తుందన్నట్లుగా రెచ్చిపోయారు. జగన్ బయటకొస్తేనే జిల్లాలో వర్గవిభేదాలు సర్దుకుంటాయనుకోవడం జరిగింది. అలాగే జరిగింది. జగన్ రావడంతోటే వర్గవిభేదాలు తెరమరుగయ్యాయి. అతను మాట ఇచ్చిన ప్రకారమే సీట్లు కేటాయిస్తాడనేది ఖాయం కావడంతో తన అనుచరులకు టిక్కెట్లిప్పించుకోవాలనుకున్న వర్గనేతలు మౌనం దాల్చారు. పార్టీలో మేకపాటి సోదరుల మూలంగానే వర్గపోరుకు తెరలేచింది. పార్టీలో వారికి తప్పితే ఇంకెవరికీ వర్గాన్ని మెయింటేన్ చేయాలనేంత కోరిక లేదు. మిగతా నాయకులంతా మేం ఆశిస్తున్న సీటు మాకు దక్కితే చాలనుకున్నారు. కాని మేకపాటి సోదరులు వీరికే ఎసరుపెట్టే ప్రయత్నాలు చేసేసరికి జిల్లా పార్టీలో వారికి వ్యతిరేకంగా ఒక వర్గం తయారుకావాల్సి వచ్చింది.

వైకాపాను స్థాపించాక జిల్లాలోని 10నియోజకవర్గాలకు ఒక్కో నాయకుడు ఫిక్స్ అయిపోయాడు. అక్కడ సీట్లు తమవేనన్న ధీమాతో ఈ నాయకులు పనిచేసుకోసాగారు. కాని మేకపాటి సోదరులు నెల్లూరు నగరంలో అనిల్‌కు పోటీగా అబ్దుల్‌అజీజ్‌ను, నెల్లూరురూరల్‌లో కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి పోటీగా ఆనం వెంకటరమణారెడ్డిని, వెంకటగిరిలో కొమ్మికి ప్రత్యామ్నాయంగా పాపకన్ను రాజశేఖర్‌రెడ్డిని, కావలిలో రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డికి బదులు మలిరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డిని తెరమీదకు తెచ్చారు. ఆయా నియోజకవర్గాల సమన్వయకర్తలుగా కూడా వీళ్లనే నియమించాలని ప్రయత్నించారు. కాని జగన్ ఆయా నియోజకవర్గాలకు కష్టపడి పనిచేస్తున్న నాయకులనే ఆయన ఇన్‌ఛార్జ్‌లుగా నియమించారు. వీరిలో ఎవరినీ మార్చడానికి అవకాశాలు లేకపోవడంతో మేకపాటి సోదరులు వీరితోనే సర్దుబాటు చేసుకుని ముందుకుపోతున్నారు. గతంలో వీరి మీదకు ఎగదోసిన నాయకులందర్నీ పక్కనపెట్టేసి, ప్రస్తుతం సమన్వయకర్తలుగా వున్నవారితో కలిసి పనిచేయడానికి మేకపాటి సోదరులు నిర్ణయించుకున్నారు. మొత్తానికి జిల్లా వైకాపాలో వర్గవిభేదాలకు మంగళం పాడినట్లే!

# ఆదర్శం చాటిన... మెట్టుకూరు



జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి వివాదాలకు అతీతంగా పనిచేస్తూ బ్యాంకు పురోభివృద్ధికి పాటుపడుతున్న మెట్టుకూరు ధనుంజయరెడ్డి తన ఔన్నత్యాన్ని చాటుకున్నారు. సాధారణంగా జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సిబ్బంది మంచి చెడ్డలను ఎవరూ పట్టించుకోరు. వీళ్లను వెలేసినట్లుగా వుంటుంది పరిస్థితి. తన బ్యాంకులో పనిచేసే సిబ్బంది బాగోగులు గురించి ఆలోచించిన ధనుంజయరెడ్డి వారికి కొన్ని ప్రోత్సాహక బహుమతులు ప్రకటించారు. తనకు నెలకు వచ్చే 20వేల వేతనం, వాహనాల అలవెన్స్‌తో సంవత్సరానికి వచ్చిన లక్షా40వేల గౌరవ వేతనం, వాహనాల అలవెన్స్ మొత్తాన్ని బ్యాంకు అభివృద్ధికి కృషిచేసిన మేనేజర్లకు ప్రోత్సాహక బహుమతిగా అందజేయాలని నిర్ణయించారు. గతంలో జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఇదే ఔన్నత్యం చూపారు.





# శత్రుత్వానికి సెలవు... ఒకే పార్టీలో కొలువు

సాధారణంగా పత్రికలలో అప్పుడప్పుడు విచిత్ర స్నేహం అని ఫోటోలు వేస్తుంటారు. పిల్లిపిల్లకు కుక్క పాలివ్వడం, కుక్క పిల్లకు పంది పాలివ్వడం, పొట్టేలు కుక్క స్నేహంగా ఉండడం... ఇలా అరుదైన స్నేహాలు. ఇలాంటి దృశ్యాలు మనకు రాజకీయాల్లో కూడా తారసపడుతుంటాయి. బద్ధశత్రువులు అనుకున్న వాళ్ళు ప్రాణస్నేహితులుగా మారిపోతారు. వీళ్ళు ఒకరికోసం ఒకరు ప్రాణాలిస్తారు అన్నట్లుగా వున్న స్నేహితులు బద్ధశత్రువులవుతారు. ప్రాణస్నేహితులనైనా విడదీయడం, బద్ధశత్రువులనైనా కలపడం ఒక్క రాజకీయాలకే చెల్లుతుంది.

ప్రస్తుతం మన జిల్లాలో అటువంటి రాజకీయ స్నేహమే ఒకటి ఏర్పడే సూచనలు కనిపిస్తున్నాయి. సర్వేపల్లి ఎమ్మెల్యే ఆదాల ప్రభాకర్‌రెడ్డి తిరిగి తెలుగుదేశంలో చేరుతాడనే ప్రచారం జరుగుతుంది. తెలుగుదేశంలో చేరడమంటే ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డితో స్నేహం చేయడమే. సర్వేపల్లి నియోజకవర్గం నుండి రెండుసార్లు సోమిరెడ్డిని ఓడించింది ఆదాల ప్రభాకర్‌రెడ్డే! ఈ పదేళ్ళకాలంలో ఇద్దరూ బద్ధశత్రువులుగా మారారు. తెలుగుదేశంలో వున్నప్పుడే వీరిమధ్య వైరం నెలకొన్నప్పటికి ఆదాల కాంగ్రెస్‌లో చేరి సోమిరెడ్డి మీద గెలిచినప్పటి నుండి ఆ వైరం మరింత ముదిరింది. వీళ్లిద్దరూ రాజకీయ విమర్శల హద్దులు దాటి వ్యక్తిగత ఆరోపణలకు కూడా దిగడం తెలిసిందే!

వాస్తవానికి ఆదాల రాజకీయ రంగప్రవేశం 1999లో తెలుగుదేశం నుండే జరిగింది. అప్పటికి సోమిరెడ్డి, ఆదాల బాగానే వున్నారు. ఆ ఎన్నికల్లో అల్లూరు నుండి గెలిచిన ఆదాల మంత్రిపదవిని ఎగరేసుకుపోయి సోమిరెడ్డిని వెనక్కునెట్టాడు. అక్కడ నుండి ఇద్దరికీ పడకుండా వచ్చింది. వీళ్ల స్నేహంగా వున్నది గట్టిగా ఏడాదికాలమే. 2004లో ఆదాల కాంగ్రెస్‌లో చేరి ఏకంగా సోమిరెడ్డి మీదే పోటీకి దిగి గెలిచాడు. అప్పటినుండి వీరిమధ్య ప్రత్యక్ష యుద్ధం మొదలైంది. ఒకరిపై ఒకరు చాలా తీవ్రంగా ఆరోపణలు చేసుకున్నారు. భవిష్యత్‌లో వీరు ఒకరి మొహం ఒకరు చూసుకోగలరా అనే స్థాయిలో తిట్టుకున్నారు.

రాజకీయాల్లో ఏదీ శాశ్వతం కాదు. ఎవరు శాశ్వతశత్రువులు కారు. రాష్ట్రంలో కాంగ్రెస్ బాల్చీ తన్నుసున్న నేపథ్యంలో చాలామంది కాంగ్రెస్ నాయకులలాగే ఆదాల కూడా ప్రత్యామ్నాయ రాజకీయమార్గంగా మాతృసంస్థ తెలుగుదేశంను ఎంచుకున్నాడు. ఈ నేపథ్యంలో జిల్లాలో ఆ పార్టీకి పెద్దదిక్కుగా వున్న సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డితో చెలిమి తప్పడంలేదు. ఇప్పటికే వీరిద్దరూ పాతవైరాన్ని వదిలేసి కొత్త స్నేహాన్ని మొదలుపెట్టినట్లుగా తెలుస్తుంది. సోమిరెడ్డి సర్వేపల్లి నుండి మళ్ళీ పోటీ చేయడానికి నిర్ణయించుకున్న నేపథ్యంలో ఆదాల నెల్లూరు లోక్‌సభ నుండి కాని నెల్లూరురూరల్ నుండి కాని పోటీకి దిగే అవకాశాలున్నాట్లు తెలుస్తుంది.



ఎక్కడ చూడు... ప్లాస్టిక్... ప్లాస్టిక్... ప్లాస్టిక్... ఇంట్లో నుండి ఖాళీ చేతులతో బయటకు వెళ్ళి పాలిథిన్ కవర్లలోని సరుకులతో ఇళ్లకు చేరడం ప్రతి ఒక్కరికీ నిత్యకృత్యమైపోయింది.

# ప్లాస్టిక్ సంస్కృతి పెరిగిపోతుంది

మనిషి జీవన విధానంలో ప్లాస్టిక్ ఓ భాగంగా మారిపోయింది. ఈ ప్లాస్టిక్ వాడకం ప్రమాదమని తెలిసినా, క్యాన్సర్ వంటి ప్రాణాంతక రోగాలకు ఇది మూలమని తెలిసినా రెడీమేడ్ జీవనానికి అలవాటుపడ్డ మనిషి నుండి దీనిని వేరు వేయడం చాలాకష్టంగా వుంది.

పాలిథిన్ కవర్లను, ప్లాస్టిక్ కవర్లను నిషేధించాలన్న అధికారుల ఆదేశాలు తూతూమంత్రంగా మారుతున్నాయి. మందుబాబులు మద్యానికి ఎలా బానిసలవుతున్నారో, ప్రజలు కూడా ప్లాస్టిక్ కవర్ల వినియోగానికి అలా బానిసలవుతున్నారు. నెల్లూరు నగరపాలకసంస్థ పరిధిలో ప్లాస్టిక్ కవర్ల సంస్కృతిపై నిషేధం విధించి ఉన్నారు. కొన్నిరోజుల పాటు నగరంలోని అన్ని దుకాణాలపై దాడులు నిర్వహించి పెద్దఎత్తున పాలిథిన్‌కవర్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రతి దుకాణంలో గుడ్డసంచులనే వాడాలని నిబంధన పెట్టారు. అయితే ఈ గుడ్డ సంచుల నిబంధనను చాలాతక్కువ వ్యాపార సంస్థలలో మాత్రమే అమలు చేస్తున్నారు. మిగతా దుకాణాలలో పాలిథిన్‌కవర్ల వాడకం యథావిధిగా జరుగుతుంది. ఈ ప్లాస్టిక్ వాడకం చాలా ప్రమాదకరం. టీబంకుల్లో ఇంతకుముందు పింగాణి, గాజుకప్పులు వాడేవాళ్లు. ఇప్పుడు ప్లాస్టిక్ కప్పులు వాడుతున్నారు. టీ లేదా కాఫీ వేడికి ఆ ప్లాస్టిక్ కొంత కరిగి మన కడుపులోకి చేరే అవకాశముంది. ఇది ప్రమాదమని తెలిసినా టీ బంకులవాళ్ళు ఆపడం లేదు. తాగేవాళ్ళు ఆగడం లేదు. కర్రీస్‌పాయింట్‌లలో పాలిథిన్ కవర్లలోనే వేడివేడిగా కూరలు ప్యాక్ చేస్తున్నారు. ఆ వేడికి కవర్లలోని పైపొర కరిగి మనం తినే ఆహారంలో కలిసిపోతుంది. హోటళ్లలో ఇంతకుముందు పార్శిల్స్‌కు అరటి ఆకులు, పేపర్లు వాడేవాళ్లు. కాని ఇప్పుడు ప్లాస్టిక్ డబ్బాలు వాడుతున్నారు.

(మిగతా 10వ పేజీలో)

PDF Compressor Free Version



# కల్యాణ వైభోగం...!



మురళీకృష్ణ హోటల్స్ వ్యవస్థాపకులు గ్రోసు గోపాలయ్య మనుమరాలు, గ్రోసు సుబ్బారావు - సత్యలక్ష్మీల కుమార్తె **షాలిని - శ్రీవిష్ణు**(హైదరాబాద్ వాస్తవ్యులు సింగనమల సుబ్రహ్మణ్యం - సరకల కుమారుడు)ల కల్యాణం ఈ నెల 12వ తేదీ నెల్లూరులోని కెజికె కల్యాణ మండపంలో ఘనంగా జరిగింది.
నూతన వధూవరులకు 'లాయర్' శుభదీవెనలు.

## డా॥ సి.యం.కె కి "భారతీయ మానవ అధికార్‌సమ్మాన్" అవార్డ్




డా॥ సి.యం.కె.రెడ్డిని సత్కరిస్తున్న సినీనటి, పార్లమెంటుసభ్యురాలు జయప్రద

అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆలిండియా కౌన్సిల్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ లిబర్టీస్, సోషల్ జస్టిస్‌వారు న్యూఢిల్లీలో ఒక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలో విశిష్ట సేవలందించడమే కాకుండా, తమిళనాడులో తెలుగువారి హక్కుల కోసం విశేషకృషి జరుపుతున్న డా॥ సి.యం.కె.రెడ్డిని "భారతీయ మానవ అధికార్ సమ్మాన్" అవార్డుతో సత్కరించారు. ప్రముఖ సినీనటి రాజ్యసభ సభ్యురాలు శ్రీమతి జయప్రద ఈ పురస్కారాన్ని డా॥రెడ్డికి అందజేశారు. దక్షిణ భారతదేశం నుండి ఈ పురస్కారాన్ని అందుకున్న ఏకైక వ్యక్తి డా॥ముద్దు కృష్ణారెడ్డి కావడం గమనార్హం. నెల్లూరీయుల ముద్దుబిడ్డ డా॥ముద్దుకృష్ణారెడ్డికి "లాయర్" అభినందనలు.

## తెలుగు వారంతా... రాష్ట్రపతికి ఇ-మెయిల్స్ పంపండి

### సమైక్యాంధ్రప్రదేశ్‌కి మద్దతుగా అమెరికాలో పిలుపునిచ్చిన ప్రొ॥ వి.నారాయణరెడ్డి



అమెరికా దేశంలోని ఫ్లోరిడా రాష్ట్రంలో జాక్సన్‌విల్లి నగరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిరక్షణ వేదిక స్థానిక వై.యస్.ఆర్. కాంగ్రెస్‌పార్టీలు సంయుక్తంగా సేవ్ ఆంధ్రప్రదేశ్ పేర సదస్సును నిర్వహించాయి. డిసెంబర్ 15వతేదీ ఆదివారంనాడు జరిగిన ఈ సదస్సులో విక్రమసింహపురి యూనివర్శిటీ మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.నారాయణరెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రాన్ని కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి తెలుగువారిపై వుందని కలసి ఉంటేనే కలదు సుఖం అన్నట్లుగా సమైక్యంగా వుండగలిగిననాడే సుఖసంతోషాలు అందరిలోనూ వుంటాయని నారాయణరెడ్డి తన ప్రసంగంలో అన్నారు. అమెరికాదేశంలోనేకాక ఇతర దేశాలలో వుంటున్న తెలుగువారంతా రాష్ట్రాన్ని సమైక్యంగా వుంచాలని కోరుతూ ఇ-మెయిల్స్ ద్వారా రాష్ట్రపతికి విజ్ఞప్తులను పంపించాలని నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్రాన్ని సమైక్యంగా వుంచగలిగిన సత్తావున్న ఏకైక నాయకుడు జగన్మోహన్‌రెడ్డేనని నారాయణరెడ్డి అన్నారు.

డా॥కె.వాసుదేవరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సుమారు 150మందికి పైగా తెలుగువారు పాల్గొన్నారు.




--- నాగభైరవ అవార్డు ప్రదానం ---

## అక్షరకవికి ఆదర్శకవి పురస్కారం..!



అద్దేపల్లి రామ్మోహన్‌రావును సత్కరిస్తున్న సినీహీరో వేణు, వెన్నెలకంటి, మణేశ్వరరావు, తుంగా శివప్రభాత్‌రెడ్డి, యిమ్మడిశెట్టి కోటేశ్వరరావు, రాచపాళెం రఘు, జలదంకి ప్రభాకర్, ముక్కాల ద్వారకానాథ్, సి.భవానిదేవి, శైలజామిత్ర

తెలుగుజాతి గర్వించదగ్గ కవి, రచయిత డా॥ నాగభైరవ కోటేశ్వరరావు. ఆయన రచనలు భావితరాలకు స్ఫూర్తినిస్తే, యువకవులకు ఆదర్శమయ్యాయి. నాగభైరవ వంటి గొప్పవ్యక్తి పేర ఆయన శిష్యులు ఏర్పాటు చేసిన "డా॥నాగభైరవ అవార్డు"ను ఈ ఏడాది సాహితీపథంలో అలుపెరగని అక్షరసేద్యం చేస్తున్న అద్దేపల్లి రామ్మోహన్ రావు అందుకున్నారు.

డిసెంబర్ 15 ఆదివారం సాయంత్రం ఆర్.యల్.రెడ్డి పురమందిరం ఈ వేడుకకు వేదికగా మారింది. ఆరున్నరడుగుల హీరో వేణు సభకు ఆకర్షణగా నిలువగా మాటలవీరుడు యం.వి.యస్ హరనాథరావు ప్రత్యేక అతిథిగా విచ్చేశారు. వెన్నెలకంటి అధ్యక్షతన జరిగిన సభకి ముక్కాల ద్వారకానాథ్, ఇమ్మడిశెట్టి కోటేశ్వరరావు, చిల్లర భవానీదేవి, జలదంకి ప్రభాకర్, తుంగాశివప్రభాత్‌రెడ్డి, జి.మణేశ్వరరావు, రాచపాళెం రఘు, డా॥ బీరం సుందరరావులు వేదికపై సాక్షులుగా విచ్చేశారు. నాగభైరవ గారి మనవరాళ్లు శ్రీమతి పద్మజ, కుమారి ఐశ్వర్య రత్నంలు జ్యోతిప్రకాశనం చేసారు.

విశేషరీతిలో సింహపురి సాహితీప్రియులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో తొలుత అవార్డు కమిటీ ప్రధానకార్యదర్శి చిన్ని నా్ా ుణరావు సభకు స్వాగతం పలికి డా॥ నాగభైరవ అవార్డుకు సంబంధించి గత 4సంవత్సరాల కార్యసరళిని తెలియజేసారు. అధ్యక్ష ఉపన్యాసం చేసిన అవార్డు కమిటీ అధ్యక్షులు వెన్నెలకంటి అద్దేపల్లిని సభకు పరిచయంచేసి అవార్డు యొక్క విశిష్టతను నాగభైరవ సమర్థతను సభకు తెలియజేశారు.

ముందుగా మాట్లాడిన ముఖ్యఅతిథి యం.వి.యస్ హరనాథరావు ఒంగోలుకు చెందిన నాగభైరవకు నెల్లూరులో ఆయన శిష్యులు అవార్డు ఏర్పాటుచేసి ప్రతిఏటా క్రమం తప్పకుండా అందజేయడాన్ని చూసి ఒంగోలు సాహితీప్రియులు సిగ్గుపడాలని అన్నారు. ఓ మహావ్యక్తి అవార్డు మరో మహానుభావుడికి అందిస్తున్న తరుణంలో తనను అతిథిగా పిలవడం ఆనందదాయకం అన్నారు.

హీరో వేణు మాట్లాడుతూ సాహిత్యం రాయలేకపోయినా పరవాలేదు చదవడం మాత్రం అలవాటుచేసుకోవాలని అన్నారు. పుస్తకాలు చదవనివాడు, సాహిత్యం పట్ల ఆసక్తి చూపనివాడు తన దృష్టిలో మనిషేకాదన్నాడు. కవులు, రచయితలు తమ రచనల ద్వారా సమాజానికి సందేశంతో పాటు స్ఫూర్తిని అందజేస్తున్నారన్నారు. లాయర్ ప్రభ ప్రసంగిస్తూ అద్దేపల్లి రచనల ద్వారానే (మిగతా 5వ పేజీలో)




నాగభైరవ స్ఫూర్తి అవార్డులు పొందిన సాహితీవేత్తలు



PDF Compressor Free Version






## అవస్తీకరణ బిల్లు

అయ్యవారి బొమ్మను తయారు చేయబోతే చింపాంజీ బొమ్మ తయారయినట్టుంది జీఓఎం నిర్వాకం! వారు రూపొందించిన ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ బిల్లును(సీమాంధ్రకు అవస్థలు కల్పించే బిల్లు) రాష్ట్రపతి ఆమోదం తెల్పకుండా త్రిప్పి పంపి, మగధీర రాష్ట్రపతిగా నిలిచి భవిష్యత్తులో రాష్ట్రపతులకు ఆదర్శంగా నిలిచి, రాష్ట్రపతి అంటే రబ్బర్‌స్టాంపు కాదు 'నిర్ణయస్టాంపు' అని నిరూపించాలని సీమాంధ్రప్రజలు కోరుతున్నారు.

కురుగూరు రంగనాథం, నెల్లూరు.

## తెలంగాణ సీట్లు చాలా?

తెలంగాణలో ఎంపీ సీట్లు వస్తే చాలు మళ్ళీ అధికారంలోకి వస్తాం అన్నట్లుగా వుంది కేంద్ర ప్రభుత్వ తీరు. నాలుగు రాష్ట్రాల ఎన్నికలలో దెబ్బతిన్నా కూడా కాంగ్రెస్‌కు బుద్ధి రావడం లేదు. రాష్ట్ర విభజనపై నిరంకుశంగా వ్యవహరిస్తుంది. దేశం నుండి కాంగ్రెస్‌ను తరిమికొట్టే సమయం ఆసన్నమైంది. కాంగ్రెస్ పూర్తిగా పోతేనే దేశం బాగుపడుతుంది.

పి.నరసింహాశాస్త్రి, నెల్లూరు.

## అందరివి నాటకాలేనా?

సమైక్యాంధ్ర విషయంలో ఏ పార్టీ వాళ్లవి నాటకాలో, ఎవరు చిత్తశుద్ధితో చేస్తున్నారో అర్థం కావడం లేదు. కాంగ్రెస్‌తో మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకున్నాడని జగన్ మీద అనుమానాలున్నాయి. చంద్రబాబు తెలంగాణ వచ్చింది మనవల్లేనని అక్కడి వాళ్లను చెప్పకోమంటూ ఇక్కడ సమన్యాయం అంటూ నాటకాలాడుతున్నాడు. కిరణ్ సమైక్యాంధ్ర వాదన చేస్తున్నా అధిష్టానం ఆయన చేత నాటకం ఆడిస్తుందా అన్న అనుమానాలూ లేకపోలేదు.

జి.వి.వి.శేఖర్, ఆత్మకూరు.

## చెట్లను నరకొద్దు


నెల్లూరులో ఎక్కడ రోడ్లు వేస్తున్నా ముందుగా చెట్లను నరికి వేస్తున్నారు. వీటిని నరకడంపై పెడుతున్న శ్రద్ధ ఆక్రమణలను తొలగించడానికి చూపడం లేదు.

కె.యస్.బాబు, నెల్లూరు.

## 'ప్రభా'తం

సెమీఫైనల్స్‌గా చెప్పుకుంటూ వచ్చిన 5రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు రేపటి దేశ రాజకీయమార్పులకు సంకేతంగా నిలుస్తున్నాయి. ఈ ఎన్నికల ఫలితాలతో కాంగ్రెస్ కథ ముగిసినట్లేనని నిర్ధారించవచ్చుగాని, రేపు కేంద్రంలో అధికారం ఎవరిదనేది ఘంటాపథంగా చెప్పలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఎన్నికలలో నరేంద్రమోడీ ఫ్యాక్టర్ పనిచేసి బీజేపీ మూడురాష్ట్రాల్లో ఘనవిజయం సాధించడంతోపాటు ఢిల్లీలో పెద్ద పార్టీగా అవతరించిందని ఆ పార్టీ శ్రేణులు ప్రచారం చేసుకుంటున్నాయి. కాని వాస్తవం అది కాదు. ఈ ఎన్నికలలో మోడీ ఫ్యాక్టర్ మూడో అంశంగా పనిచేసింది. మొదటిది కాంగ్రెస్ పట్ల ప్రజల్లో పెరిగిన వ్యతిరేకతయితే, రెండోది రెండు రాష్ట్రాల్లో బీజేపీ మళ్ళీ అధికారంలోకి రావడానికి కారణం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రుల పరిపాలనా సామర్థ్యమే. వీటికి మూడో అంశంగా మోడీ ఆదరణ తోడైంది. మోడీ ప్రచారం చేయకపోయినా మధ్యప్రదేశ్‌లో బీజేపీ మళ్ళీ అధికారంలోకి వచ్చివుండేది. కాకపోతే ఇప్పుడు వచ్చినవాటికంటే ఓ పదిసీట్లు తగ్గివుండేవి. ఛత్తీస్‌గఢ్‌లో మోడీ ఇమేజ్ లేకుంటే బీజేపీకి ఇంకో రెండుమూడు సీట్లు తగ్గేవి. మోడీ మంత్రం లేకున్నా రాజస్థాన్‌లో బీజేపీ అధికారంలోకి వచ్చివుండేది. కారణం రాష్ట్రంలోనూ, కేంద్రప్రభుత్వం పట్ల ప్రజల్లో వచ్చిన వ్యతిరేకత. ఢిల్లీలోనూ కాంగ్రెస్ మట్టికొట్టుకుపోవడానికి కారణం కేంద్రంలోని యూపిఏ పాలనా వైఫల్యమే. కాంగ్రెస్‌కు ఇక్కడ ఆమ్‌ఆద్మీ పార్టీ ప్రత్యామ్నాయంగా వుంది. ఢిల్లీ ఓటర్లు బీజేపీతో పాటూ ఈ పార్టీని కూడా సమంగా ఆదరించారు. ఆమ్‌ఆద్మీ ఇదే వూపును నిలబెట్టుకుంటే ఢిల్లీ జనాలు కాంగ్రెస్‌ను మరచిపోయినట్లే! మిజోరాంలో కాంగ్రెస్ గెలుపు పెద్దగా పట్టించుకోవాల్సిన విషయం కాదు.

### ఆ ఫలితాలే కొలమానం కాదు



4 రాష్ట్రాల ఎన్నికల్లో మోడీ ఫ్యాక్టర్ మూడో అంశంగా పనిచేసింది. మొదటిది కాంగ్రెస్ పట్ల ప్రజల్లో పెరిగిన వ్యతిరేకతయితే, రెండోది రెండు రాష్ట్రాల్లో బీజేపీ మళ్ళీ అధికారంలోకి రావడానికి కారణం ఆ రాష్ట్ర ముఖ్యమంత్రుల పరిపాలనా సామర్థ్యమే. వీటికి మూడో అంశంగా మోడీ ఆదరణ తోడైంది.

ఈ రాష్ట్రాల ఫలితాలు కాంగ్రెస్ వినాశనాన్ని సూచిస్తున్నాయి. రేపటి ఎన్నికల్లో కాంగ్రెస్ బలంగా లోక్‌సభ సీట్లను తెచ్చుకోగలదు అన్న నమ్మకం వున్నది కర్ణాటక, కేరళ, కొన్ని ఈశాన్యరాష్ట్రాలలో మాత్రమే. ఒక్క పెద్ద రాష్ట్రంలో కూడా కాంగ్రెస్‌కు గణనీయంగా సీట్లొస్తాయనే పరిస్థితి లేదు. ముఖ్యంగా కాంగ్రెస్‌తో పొత్తుకు ఏ ప్రాంతీయ పార్టీ కూడా ముందుకు రావడం లేదు. తమిళనాడులో డిఎంకె ఈసారి పొత్తుకుససేమిరా అంటుంది. డిఎంకెతో పొత్తు లేకుండా ఇక్కడ ఒక సీటు రావడం కూడా కష్టమే. కేరళలోనూ ఈసారి భారీగా సీట్లు గెలిచే అవకాశాలు లేవు. కర్ణాటకలో బీజేపీ, యడ్యూరప్ప కలిస్తే కాంగ్రెస్‌కు ఆశించినన్ని సీట్లు రావు. గత రెండు ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కు దేశంలోనే అత్యధికస్థానాలు అందించిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్. కాని ఇక్కడ చేజేతులా ఆ పార్టీయే నాశనాన్ని కొనితెచ్చుకుంది. కాంగ్రెస్‌కు ఇన్ని వస్తాయనే గ్యారంటీ లేదు. యూపీ, బీహార్, గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ వంటి ఉత్తరాది రాష్ట్రాల్లోనూ కాంగ్రెస్‌కు పెద్దగా సీన్ లేదు. కాంగ్రెస్ అధికారంలో వున్న రాష్ట్రాలలోనూ యూపిఏ ప్రభుత్వ వైఫల్యాల ప్రభావం వుంది కాబట్టి పెద్దగా లోక్‌సభస్థానాలు వచ్చే అవకాశాలు లేవు. పశ్చిమబెంగాల్‌లో తృణమూల్‌కాంగ్రెస్, మహారాష్ట్రలో ఎన్‌సిపిలు కూడా ఈసారి కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకునే పరిస్థితి లేదు. కాబట్టి ఆయా రాష్ట్రాలలోనూ కాంగ్రెస్‌కు మెరుగైన సీట్లు రాకపోవచ్చు.

అయితే కాంగ్రెస్‌కు తగ్గిన సీట్లన్నీ బీజేపీ ఖాతాలో చేరుతాయనుకుంటే పొరపాటే! ఇవన్నీ కూడా ఆయా రాష్ట్రాలలో ప్రాంతీయపార్టీల ఖాతాలో జమ కాబోతున్నాయి. దేశవ్యాప్తంగా నరేంద్రమోడీ ఇమేజ్ వుండడంలో వాస్తవం ఉంది. అయితే అది బీజేపీకి కనీసం ఇప్పుడున్న ఎన్డీఏ కూటమికి సంపూర్ణ మెజార్టీ తెచ్చే స్థితిలో లేదు. కేరళ, తమిళనాడులలో కూడా మోడీ ఫ్యాక్టర్ వుంది. అయితే దాని ద్వారా బీజేపీకి ఓట్లు పెరుగుతాయోమోగాని, సీట్లు రావు. ఆంధ్రప్రదేశ్‌లోనూ మోడీ ఇమేజ్ వుంది. కాని ఒంటరిగా పోటీచేస్తే ఆ పార్టీ గెలుస్తుందని చూపించడానికి ఒక్క స్థానం కూడా గ్యారంటీ లేదు.

ఈ పరిస్థితులను చూస్తుంటే వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాన పోటీ ఎన్డీఏకు, ప్రాంతీయపార్టీల కూటమికి మధ్యే ఉండబోతుంది. ప్రాంతీయపార్టీలకు వచ్చే సీట్లతో పోలిస్తే కాంగ్రెస్‌కు ఇంకా తక్కువే వస్తాయి. ఈ ఎన్నికల్లో ప్రాంతీయపార్టీలు కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుంటే యూపిఏ ప్రభావం వాటిమీద కూడా పడుతుంది. కాబట్టే ఏ ప్రాంతీయపార్టీ కూడా కాంగ్రెస్‌తో పొత్తుకు ముందుకు రావడం లేదు. అలాగని బీజేపీతోనూ చేతులు కలపడానికి ఇష్టపడడం లేదు. ఎందుకంటే తమ సొంత ప్రతిభతో గెలిచినా మోడీ ఇమేజ్‌తో గెలిచామనే ప్రచారం వస్తుంది.

ఇప్పుడు కొందరు పాతమిత్రులనైనా దగ్గరకు తీసుకోకపోతే బీజేపీకి కూడా ఆశించిన ప్రయోజనం నెరవేరదు. పశ్చిమబెంగాల్, ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు వంటి రాష్ట్రాలలో స్థానిక పొత్తుల ద్వారా మాత్రమే బీజేపీకి కొన్నయినా సీట్లు వస్తాయి. అన్నాడిఎంకె, తెలుగుదేశం, బిజూజనతాదళ్ వంటి పార్టీలను తిరిగి దగ్గర చేసుకుంటేనే బీజేపీ అధికారం ఆశలు సజీవంగా ఉంటాయి.

## 'అంతర్'జాతీయం

- దక్షిణాఫ్రికా మాజీఅధ్యక్షుడు నెల్సన్ మండేలా అంత్యక్రియలు 15వ తేదీ ఆయన స్వగ్రామం క్యునులో నిర్వహించారు. దక్షిణాఫ్రికా ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో ఆయన అంత్యక్రియలను పూర్తి చేసింది.
- ప్రపంచంలోనే అత్యంత ధనవంతుల్లో ఒకరైన ప్రవాసభారతీయుడు లక్ష్మీనివాస్ మిట్టల్ తమ్ముడి కుమార్తె వివాహవేడుకలను లండన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ పెళ్లి కోసం 460కోట్ల రూపాయలు ఖర్చు పెట్టారు.
- సరిహద్దుల్లో చైనా బలగాలు మరోసారి హద్దుమీరాయి. లడక్‌లోని భారత భూభాగం నుండీ ఐదుగురు పశువుల కాపర్లను అపహరించాయి. తిరిగి వారిని భారత సైన్యానికి అప్పగించాయి.
- కేంద్ర కార్మికశాఖ మంత్రి శీష్‌రాంఓలా(86) 15వ తేదీ ఉదయం అనారోగ్యంతో మరణించారు. ఆయన రాజస్థాన్ రాష్ట్రానికి చెందినవారు. ఐదుసార్లు లోక్‌సభకు, 8సార్లు అసెంబ్లీకి గెలిచారు.
- వచ్చే సాధారణ ఎన్నికలను వివిధ దశల్లో నిర్వహించి జూన్ 1 నాటికి 16వ లోక్‌సభను ఏర్పాటు చేస్తామని ఎన్నికల సంఘం ప్రధాన కమీషనర్ వి.ఎస్.సంపత్ వెల్లడించారు. మార్చి మధ్యలో ఎన్నికల ప్రక్రియ మొదలవుతుందని అమెరికా పర్యటనలో వున్న ఆయన పేర్కొన్నారు.
- రోదసిలోకి ఒక కోతిని పంపి క్షేమంగా దానిని భూమిపైకి తీసుకొచ్చినట్లు ఇరాన్ ప్రకటించింది. వివాదాస్పద బాలిస్టిక్ క్షిపణి ద్వారా ఇరాన్ ఈ ప్రయోగం నిర్వహించింది.
- చైనా నుండి చొరబాట్ల అంశాన్ని తోసిపుచ్చలేమని కేంద్ర రక్షణశాఖ మంత్రి ఆంటోనీ పేర్కొన్నారు. సరిహద్దు, రక్షణ సహకార ఒప్పందం అమలులోకి వచ్చిన నేపథ్యంలో ఇటువంటి వాటిని సున్నితంగా పరిష్కరించుకోవచ్చునన్నారు.
- సిక్కుల ఊచకోత(1984)కు బాధ్యులైన వారిని కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ రక్షిస్తున్నారనే ఆరోపణలపై జనవరి 2లోగా ఆమె స్పందన తెలపాలని అమెరికా కోర్టు ఆదేశించింది. అమెరికాలోని సిక్స్‌ఫర్ జస్టిస్ సంస్థ సోనియాపై అమెరికాలో కేసు దాఖలు చేసింది.
- రాజస్థాన్‌లో ఎన్నిక జరిగిన చురు అసెంబ్లీ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకుంది. 200సీట్లున్న అసెంబ్లీలో బీజేపీ సభ్యుల సంఖ్య 163కు చేరింది.
- జర్మనీ ఛాన్సలర్‌గా ఏంజెలా మెర్కెల్(59) 17వ తేదీ ప్రమాణస్వీకారం చేసారు. ఆమె ఈ పదవి చేపట్టడం ఇది మూడోసారి.
- వివాదాస్పద బంగ్లాదేశ్ రచయిత్రి తస్లీమానస్రీన్‌కు వ్యతిరేకంగా ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోరాదని ఉత్తరప్రదేశ్ పోలీసులను సుప్రీంకోర్టు ఆదేశించింది.

## వార్త వ్యాఖ్య

వార్త :- బెయిల్‌పై జైలు నుండి విడుదలైన లాలూ.
**వ్యాఖ్య :- పశువులు బెదురుతాయేమో!**

వార్త :- సీమాంధ్రనేతల్లో ఐక్యత ఏదీ. - కేంద్రమంత్రి పనబాక.
**వ్యాఖ్య :- అంటే అందర్నీ మీ దార్లోకి రమ్మనా?**

వార్త :- గవర్నర్ చేతికి శాంతిభద్రతలు విడ్డూరం. - ఎంఐఎం నేత అసదుద్దీన్ ఓవైసీ.
**వ్యాఖ్య :- లేకుంటే మీ చేతికిమ్మంటారా?**

వార్త :- విభజనకు మద్దతు ఇచ్చే బీజేపీతో పొత్తా? - 'దేశం'పై బొత్స వ్యాఖ్యలు.
**వ్యాఖ్య :- పోనీ విభజించే కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకోమంటారా?**

వార్త :- అవినీతిపై యుద్ధం ప్రారంభించండి. - కలాం.
**వ్యాఖ్య :- ఏ యుద్ధంలో అయినా గెలవచ్చేమోగాని ఈ యుద్ధంలో గెలవడం కష్టమే!**

వార్త :- కొత్త రాజకీయానికి తరుణమిదే. - లోక్‌సత్తా అధినేత జేపీ.
**వ్యాఖ్య :- కొత్త రాజకీయాలంటే ఓటు రేటు పెరుగుతుందని ఆశపడతారు.**

వార్త :- రాష్ట్ర విభజన అసంబద్ధం. - జస్టిస్ పి.చంద్రశేఖర్‌రావు.
**వ్యాఖ్య :- అసంబద్ధమైన పనులు చేయడమే కాంగ్రెస్ స్పెషాలిటీ.**

వార్త :- పార్లమెంటులో అల్లూరి విగ్రహం ఏర్పాటు చేయాలి. - అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ అక్షర సేవాసమితి.
**వ్యాఖ్య :- ఆయనేమన్నా నెహ్రూ కుటుంబంలో పుట్టాడా?**

వార్త :- జగన్ నా కుమారుడులాంటివాడు. - దిగ్విజయ్.
**వ్యాఖ్య :- మీలాంటి తండ్రిని మాత్రం ఎవరూ కోరుకోరు.**

వార్త :- బిల్లులో అనేక ఉల్లంఘనలు. - చంద్రబాబు.
**వ్యాఖ్య :- అసలు బిల్లే పెద్ద ఉల్లంఘన.**

వార్త :- బిల్లును గట్టిగా వ్యతిరేకిద్దాం. - సీమాంధ్ర నేతలతో సీఎం.
**వ్యాఖ్య :- ఏవన్నా ఉపయోగముండే మాటలు చెప్పండి.**

వార్త :- కాంగ్రెస్‌తోనే ఉంటా. - లాలూ.
**వ్యాఖ్య :- రెండూ మునిగే పడవలే కదా!**

వార్త :- హైదరాబాద్‌లో పోటీ చేయండి... టిక్కెట్టిస్తాం. - ఆదాలకు కేటీఆర్ ఆఫర్.
**వ్యాఖ్య :- మావాళ్ళు పోటీ చేసేపనయితే మీకు టిక్కెట్లు మిగలవు.**

PDF Compressor Free Version



# స్వార్థ రాజకీయాల కోసం రాష్ట్ర విభజన




ప్రజలు ఏమైపోయినా ఫరవాలేదనే ధోరణితో తమ స్వార్థ రాజకీయాల కోసం రాష్ట్రాన్ని విభజిస్తున్నారని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్త పి.అనిల్ కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. ప్రజాదీవెన కార్యక్రమంలో భాగంగా మంగళవారం నెల్లూరులోని 45వ డివిజన్, విష్ణేశ్వరపురం, పొర్లకట్ట ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ సోమవారం అసెంబ్లీలో తెలంగాణా బిల్లు ప్రవేశపెట్టే సమయంలో కాంగ్రెస్ పార్టీ హైకమాండ్ పథకంలో భాగంగానే ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రతిపక్ష నాయకుడు చంద్రబాబునాయుడు అసెంబ్లీకి డుమ్మా కొట్టారన్నారు. రాష్ట్రప్రజలు వైయస్ జగన్ నాయకత్వంలోనే రాష్ట్రం సమైక్యంగాను, సుభిక్షంగాను ఉంటుందని భావిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ముప్పసాని శ్రీనివాసులు దువ్వూరు శైలేంద్రనాథ్, ఆసిఫ్, గాది వెంగా రెడ్డి, లాలాతోట సుధీర్, శోభారాణి, సురేంద్ర, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## వియస్‌యూ పరిధిలో...

# ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలలు

విక్రమ సింహపురి యూనివర్సిటీ పరిధిలో వచ్చే ఏడాది నుంచి ఇంజినీరింగ్, ఫార్మసీ కళాశాలల ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వియస్‌యు ఉపకులపతి రాజారామిరెడ్డి అన్నారు. మంగళవారం నెల్లూరుజిల్లా ఆత్మకూరులోని విశ్వవిద్యాలయంలో అన్ని తరగతుల గదుల్ని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చే ఏడాది ఫిబ్రవరిలో విశ్వవిద్యాలయం పాలనా భవనాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. విశ్వవిద్యాలయం పరిధిలో సిలబస్ త్వరితగతిన పూర్తి చేయాలని సూచించామన్నారు. ప్రత్యేక గుర్తింపు ద్వారా జిల్లాలో విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్, గూడూరులోని డిఆర్‌డబ్ల్యూ, కావలిలోని జవహర్‌భారతి కళాశాలలకు ప్రతిఏటా యుజిసి నుంచి రూ.1.50 కోట్లు అదనపు నిధులు వస్తాయన్నారు. యూనివర్సిటీల స్థాయిలో అభివృద్ధిచేసే క్రమంలో భాగంగా జాతీయస్థాయిలో 45కళాశాలలను ఎంపిక చేశారన్నారు. అందులో గూడూరులోని డిఆర్‌డబ్ల్యూ స్థానం సంపాదించిందన్నారు. దాదాపు రూ.50 కోట్లు ప్రణాళిక వ్యయంతో దీనిని అభివృద్ధి చేస్తారన్నారు.

# తెలంగాణ బిల్లును వెనక్కు పంపాలి


తెలంగాణ బిల్లు ప్రతులను దగ్ధంచేస్తున్న టిఎన్ఎస్ఎఫ్ కార్యకర్తలు

తెలంగాణబిల్లును సీమాంధ్ర నాయకులు, సమైక్యవాదులు వెంటనే వెనక్కు పంపాలని టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిరుమలనాయుడు పేర్కొన్నాడు. సోమవారం రాష్ట్ర విభజన ప్రక్రియకు నిరసనగా నెల్లూరు విఆర్‌సి సెంటర్ వద్ద నిరసన ప్రదర్శన, రాస్తారోకో నిర్వహించి తెలంగాణబిల్లు ప్రతుల నమూనాలను దగ్ధం చేసారు. ఈ కార్యక్రమంలో అమ్మల్లా, మోను, హర్ష, ప్రేమ్‌కుమార్‌రెడ్డి, సాయికిషోర్, దత్తులు పాల్గొన్నారు.

# అక్షరకవికి ఆదర్శకవి పురస్కారం!

(3వ పేజీ తరువాయి)

కాకుండా ఆయన జీవన విధానం ద్వారా కూడా యువతకు స్ఫూర్తినిస్తారనడానికి ఆయన డ్రస్సింగ్ ఉదాహరణగా పేర్కొన్నారు. 77సంవత్సరాల వయస్సులో జీన్స్ ప్యాంటుతో ఎర్రరంగు గళ్ళ చొక్కాతో వున్న అద్దేపల్లిని చూస్తుంటే అక్కినేని నాగేశ్వరరావు గుర్తొస్తున్నారని అన్నారు. గురువు పేర శిష్యులు అవార్డు ఏర్పాటుచేసి ప్రముఖులకు అందించడం బహుశా రాష్ట్రంలోనే ఇదే తొలిదేమో అని నిర్వాహకులను అభినందించారు.

ఇమ్మడిశెట్టి కోటేశ్వరరావు మాట్లాడుతూ యం.వి.యస్. హరనాథరావు వంటి వ్యక్తుల సమక్షంలో నాగభైరవ అవార్డును అద్దేపల్లికి అందించడం సమంజసమైన సందర్భంగా కొనియాడారు. తెలుగుభాష అభివృద్ధికి ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా వుందన్నారు. అద్దేపల్లి రామ్మోహనరావుని గజమాలతోనూ, శాలువాతోనూ సత్కరించి, 10వేల నగదుతో పాటు నాగభైరవ కోటేశ్వరరావు అవార్డును అందజేశారు. తనకు జరిగిన సత్కారానికి స్పందిస్తూ గతంలో తనకు ఎన్నో అవార్డులు వచ్చాయని, సత్కారాలు జరిగాయని కాని ఇంత వైభవంగా వందలాది మంది సాహితీప్రియుల మధ్య జరగడం ఇదే తొలిసారని అన్నారు. తనకు ఇంతటి సముచిత గౌరవాన్ని అందజేసిన సింహపురి సాహితీప్రియులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ సందర్భంగా మరో 5మంది సాహితీవేత్తలకు "నాగభైరవ స్ఫూర్తి" అవార్డులను అందజేశారు. విజయవాడ నివాసి జలదంకి ప్రభాకరరావు, చీరాలకు చెందిన వడలి రాధాకృష్ణ, హైదరాబాద్ వాస్తవ్యులు శైలజామిత్ర, వినుకొండ వాస్తవ్యులు కరీముల్లా, చెన్నై నగరానికి చెందిన అప్పదపీయం వెంకటేశ్వరలను జ్ఞాపిక, శాలువాలతో పాటు రూ.1,116/- నగదు అందించి గౌరవంగా సత్కరించారు. సభాప్రారంభానికి ముందు కళాంజలి అనంత్ ఆధ్వర్యంలో జరిగిన నృత్యవిభావరిలో మాస్టర్ ఆదర్శ్ కూచిపూడి నృత్యం, కల్యాణి, స్ఫూరిక సినీనృత్యాలు సభికులను ఆకట్టుకున్నాయి.

కార్యక్రమంలో రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన సాహితీప్రియులు, నెల్లూరులోని డా॥ నాగభైరవ శిష్యులు, పురప్రముఖులు, సినీహీరో వేణు అభిమానులు పాల్గొన్నారు.

# మద్యం దుకాణం సీజ్

నెల్లూరు నగరంలోని సంతపేట ములుమూడి బస్టాండ్ ప్రాంతంలో ఎంఆర్‌పి ధరలు ఉల్లంఘించారని ఓ మద్యం దుకాణాన్ని ఎక్సైజ్ సిఐ సూర్య నారాయణరావు మంగళవారం రాత్రి సీజ్ చేసారు. మద్యం దుకాణదారులు తప్పనిసరిగా ఎంఆర్‌పి ధరలకే మద్యాన్ని విక్రయించాలని కొంతకాలంగా లైసెన్స్‌దారులను హెచ్చరించినా మద్యం దుకాణదారులు నిబంధనలు ఉల్లంఘించి అధిక ధరలకు మద్యాన్ని విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎక్సైజ్ సిఐ మంగళవారం రాత్రి తనిఖీలు నిర్వహిస్తూ ములుమూడి బస్టాండ్ ప్రాంతంలోని ఓ మద్యం దుకాణంలో అధిక ధరలకు మద్యాన్ని విక్రయిస్తుండగా స్వయంగా పట్టుకొని దుకాణాన్ని సీజ్‌చేశారు. లక్ష రూపాయల జరిమానా విధించడమే కాకుండా హైదరాబాద్ కమీషనర్ కార్యాలయం నుండి మళ్ళీ అనుమతి వచ్చే వరకు దుకాణాన్ని తెరిపించేదిలేదని సిఐ తెలిపారు.

# దీర్ఘకాలిక రుణాల లక్ష్యం 12కోట్లు

## కేంద్ర సహకార బ్యాంకు ఛైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి

నెల్లూరు గాంధీబొమ్మ వద్దగల కేంద్ర సహకార బ్యాంకు కార్యాలయంలో ఈనెల 14న పాలకవర్గ సాధారణ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న బ్యాంకు ఛైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని 79 సహకార సంఘాలకు 2013-14 రబీ కింద 8కోట్ల స్వల్పకాలిక రుణాలు కేటాయించామన్నారు. అన్ని సహకార బ్యాంకుల్లో రైతులకు సున్న శాతం బ్యాలెన్సుతో ఖాతాలు తెరిచేలా నిర్ణయించామని తెలిపారు. దీర్ఘకాలిక రుణాల కింద 12కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నామని ఇప్పటి వరకు 7.40కోట్లు రుణాలు రైతులకు అందించామన్నారు. నాబార్డు సాయంతో ఆరు సహకార సంఘాల్లో రైతులకు ద్విచక్రవాహనాలు, ఆభరణాల కొనుగోలు రుణాలు మంజూరు చేసామని తెలిపారు. ప్రభుత్వం తనకు గౌరవవేతనంగా ఇస్తున్న 14వేలను 7మంది బలహీనవర్గాలకు చెందిన నామినేటెడ్ డైరెక్టర్లకు 2వేల చొప్పున గౌరవవేతనంగా ఇస్తున్నట్లు తెలిపారు. ఇంకా ఉత్తమ సేవలందించే వారిని గుర్తించి 35వేలు, 25వేలు, 20వేల చొప్పున బహుమతులు ఇస్తామని, తనకు ఇచ్చే గౌరవవేతనం సరిపోకపోతే సొంత నగదును ఖర్చు చేస్తామని తెలిపారు. సమావేశంలో కేంద్ర సహకారబ్యాంకు ఉపాధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి, సీఈఓ. రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర అధ్యక్షుడిగా అశోక్‌బాబు పనికిరాడు

## జిల్లా ఎన్జీవో అధ్యక్షుడు రవీంద్రబాబు

ఉద్యోగుల సమస్యలను పట్టించుకోకుండా తానే సర్వజ్ఞుడుగా వ్యవహరిస్తున్న రాష్ట్ర ఎన్జీవో అధ్యక్షుడు అశోక్‌బాబు రాష్ట్ర అధ్యక్షుడిగా పనికిరాడని నెల్లూరు జిల్లా ఎన్జీవో అధ్యక్షుడు పి.రవీంద్రబాబు పేర్కొన్నారు. ఆదివారం నెల్లూరు నగరంలోని ఎన్జీవో భవన్‌లో శ్రీపొట్టిశ్రీరాములు 61వ వర్ధంతి సందర్భంగా, నెల్సన్ మండేలా మృతికి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా రవీంద్రబాబు మాట్లాడుతూ సమైక్య రాష్ట్ర పరిరక్షణ ఉద్యమంలో 66 రోజుల సమ్మె కాలాన్ని క్రమబద్ధీకరించే విషయమై ఇంత వరకు ప్రభుత్వం ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వ లేదన్నారు. ఎన్జీవోలకు సంబంధించి ఎన్నో సమస్యలు ఉంటే హడావుడిగా ఎన్జీవోల ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చి దొడ్డిదారిన తిరిగి రాష్ట్ర అధ్యక్షుడయ్యేందుకు అశోక్‌బాబు ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. జనవరి 5వ తేదీన జరిగే రాష్ట్ర ఎన్నికల్లో అశోక్‌బాబును ఓడించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రమణారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకమరాజు, జిల్లా నాయకులు అంజనేయవర్మ, సుధాకర్‌రావు, శ్రీకాంత్, శివకుమార్ పాల్గొన్నారు.

# వేతన సవరణకు నిరసనగా బ్యాంక్ సేవలు బంద్


యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్స్ (యుఎఫ్‌బియు) పిలుపు మేరకు బుధవారం నెల్లూరు జిల్లా వ్యాప్తంగా ఉద్యోగుల సమ్మె నిర్వహించారు. జాతీయ బ్యాంకులన్నీ మూతబడ్డాయి. బ్యాంకుల్లో పని చేస్తున్న ఉద్యోగులు అందరూ ఈ సమ్మెలో పాల్గొన్నారు. నెల్లూరు బారకాసు వద్దనున్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కార్యాలయం వద్ద యుఎఫ్‌బియు ఆధ్వర్యంలో జరిగిన ధర్నాలో యుఎఫ్‌బియు జిల్లా కన్వీనర్ ఏఐబీఈఏ ప్రధాన కార్యదర్శి ఎన్.వి.ప్రసాద్ మాట్లాడుతూ విదేశీ, ప్రైవేట్ సంస్థలకు ఉచితంగా లైసెన్సులను మంజూరు చేసి బ్యాంకింగ్ రంగాన్ని ప్రైవేటీకరణ పాలు చేసే ప్రభుత్వ విధానాన్ని అడ్డుకుంటామన్నారు. 14 నెలల నుంచి నాన్చుతున్న పదవ ద్వైపాక్షిక వేతన ఒప్పందాన్ని తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేసారు. ప్రజా వ్యతిరేక సంస్కరణలను నిలిపివేయాలని, బ్యాంకుల విలీనాన్ని ఆపి వేయాలని ఐదు రోజుల పని విధానాన్ని అమలు చేయాలని, బ్యాంక్ ఉద్యోగి మరణిస్తే ఆ కుటుంబంలోని వారికి కారుణ్య ఉద్యోగ అవకాశం కల్పించాలనే డిమాండ్‌లతో సమ్మెను చేస్తున్నామన్నారు. ధర్నాలో ఉద్యోగ సంఘనాయకులు తిరుపతయ్యనాయుడు, వెంకటేశ్వరరావు, రామకృష్ణ, కె.ఎస్.ప్రసాద్, భాస్కర్‌రెడ్డి, దిలీప్, ఉద్యోగులు పాల్గొన్నారు. సమ్మె సందర్భంగా జిల్లాలోని అన్ని జాతీయ బ్యాంకులు మూతపడ్డాయి. సుమారు రూ.100 కోట్ల మేర లావాదేవీలు స్తంభించాయి.

## కాలధర్మం

### పీడిత ప్రజల పక్షపాతి, ప్రజాతంత్రవాది...

# సీనియర్ అడ్వొకేట్ మలిరెడ్డి కృష్ణప్రసాద్

న్యాయం నిలిచే వుంటుంది. ధర్మం గెలిచే తీరుతుంది. కాకపోతే సమయం ఎంత పడుతుందో చెప్పలేం. అయినప్పటికీ న్యాయం పట్ల, ధర్మం పట్ల నిబద్ధతతో ఒక ఆశావహ దృక్పథంతో తమ జీవితాల్ని అంకితం చేసిన మహానుభావులు కొందరే. అటువంటి మహనీయుల కోవకు చెందిన వారు నెల్లూరు జిల్లా విడవలూరు మండలం చౌకచర్ల గ్రామస్థులైన సీనియర్ న్యాయవాది మలిరెడ్డి కృష్ణప్రసాద్. ఆయన 34 సంవత్సరాలు న్యాయవాదిగా కొనసాగి పీడిత ప్రజల పక్షపాతిగా, ప్రజాతంత్రవాదిగా నిలిచి డిసెంబర్ 14 శనివారం రాత్రి, తెల్లవారితే ఆదివారం దివంగతులయ్యారు. ఆయన వయస్సు 76సంవత్సరాలు.



1936లో మధ్యతరగతి కుటుంబానికి చెందిన కోటారెడ్డి, పుల్లమ్మ దంపతులకు జన్మించిన ఆయన సాల్వేషన్ ఆర్మీ స్కూల్‌లో ప్రాథమిక విద్యను, నెల్లూరు సెంట్‌పీటర్ హైస్కూలులో ఉన్నత విద్యను అభ్యసించి, వి.ఆర్.కళాశాలలో డిగ్రీ, లా కళాశాలలో బి.ఎల్ చదివారు. లాయర్‌గా ప్రాక్టీస్ చేస్తూ నాగపూర్ యూనివర్సిటీలో మాస్టర్ ఆఫ్ లా(యం.యల్) చదివారు. డిగ్రీ పూర్తయిన వెంటనే మద్రాస్ కె.సి.పి.లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగంలో చేరి తమిళభాషను నేర్చుకున్నారు. కంపెనీలో ట్రేడ్ యూనియన్ కార్యక్రమాల్లో పాల్గొనేవారు. కాని కంపెనీ అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలతో విసిగిపోయి ఆ ఉద్యోగాన్ని వదిలిపెట్టి, మరో ఉద్యోగంలోకి వెళ్ళినా ఎక్కువ కాలం పనిచేయలేకపోయారు. అందుకని సొంత గ్రామం చేరుకుని వ్యవసాయం చేసుకుంటూ గ్రామ సర్పంచ్‌గా, కోవూరు సమితి ఉపాధ్యక్షులుగా పనిచేసారు. ఆ కాలంలో ప్రజల సమస్యల పరిష్కారం కోసం చౌకచర్ల నుంచి సైకిల్‌పై కోవూరుకు వచ్చి వెళ్ళేవారు. 1974లో వి.ఆర్.లా కళాశాలలో మొదటి బ్యాచ్‌లో చదివి 1977లో "లా" పూర్తిచేసి, 1978లో న్యాయవాదిగా నెల్లూరులో ప్రాక్టీసు మొదలుపెట్టారు. ఎవరివద్దా జూనియర్‌గా చేరకుండానే ఇండిపెండెంట్‌గా ప్రాక్టీసు చేసారు. ఎవ్వరైనా లీగల్ విషయాలలో సలహాలు అడిగితే ఎంతో ఓపిగ్గా జవాబు ఇచ్చేవారు. న్యాయవాదుల సంఘాలకు సూచనలు, సలహాలు ఇచ్చేవారు. ఆయన దగ్గర దాదాపు 30మంది న్యాయవాదులు శిక్షణ పొందారు. ఆయన ఇద్దరు కుమారులు న్యాయవాదవృత్తినే చేపట్టి నెల్లూరులో సేవలందిస్తుండడం విశేషం. వారే ప్రస్తుతం ప్రముఖ న్యాయవాదులుగా పేరొందిన మలిరెడ్డి శ్రీనివాసులు, మలిరెడ్డి కోటారెడ్డిలు. ఆయన కుమార్తె శ్యామల జిల్లా కాంగ్రెస్‌నాయకుడైన చేవూరు దేవకుమార్‌రెడ్డి సతీమణి.

జనశక్తి, సహితం పత్రికలకు వ్యాసాలు వ్రాసే మలిరెడ్డి కృష్ణప్రసాద్‌కు తరిమెల నాగిరెడ్డి అంటే ప్రత్యేక అభిమానం వుండేది. నాగిరెడ్డి ప్రోత్సాహంతోనే ఆ పత్రికలకు రచనలందించారు. ఆయన వామపక్ష పార్టీల పట్ల సానుభూతి కలిగి వుండే వారే కాని ఏ పార్టీలోనూ సభ్యత్వం తీసుకోలేదు ప్రజాతంత్రవాదిగానే వుంటూ వారికి సహాయ సహకారాలు అందించేవారు. ఆయన మరణించిన విషయం తెలిసి వందలాది మంది పార్థివదేహాన్ని దర్శించి నివాళులు అర్పించటమే ఆయన పట్ల ప్రజలకున్న అభిమానాన్ని తెలియజేస్తోంది. అటువంటి నిష్కళంక న్యాయవాది మలిరెడ్డి కృష్ణప్రసాద్ కుటుంబానికి "లాయర్" ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తోంది.

PDF Compressor Free Version





జనవరిలో నిర్వహించే పక్షుల పండుగ ఏర్పాట్లపై ఈ నెల 18వ తేదీన సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ కల్యాణ మండపంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ప్రసంగిస్తున్న జిల్లా కలెక్టర్ ఎన్.శ్రీకాంత్, వివిధశాఖల అధికారులు


# నెల్లూరు కబుర్లు



## కార్పొరేషన్‌లో... నిద్రమత్తు

నెల్లూరు నగరపాలకసంస్థలో పని వేగం మందగించింది. పన్నుల వసూళ్లు తప్ప మిగతా కార్యకలాపాలు పెద్దగా కనిపించడం లేదు. పాలకవర్గం లేకపోవడం, కార్పొరేషన్‌కి ప్రత్యేక అధికారిగా వుండాల్సిన జిల్లా కలెక్టర్ పెద్దగా కార్పొరేషన్‌పై దృష్టి పెట్టకపోవడం, అడిషనల్ జాయింట్‌కలెక్టర్ పెంచలరెడ్డి గారు సౌమ్యుడు కావడం మునిసిపాలిటీ అధికారులకు అలుసుగా మారినట్లు కనిపిస్తోంది. నగరం నిండా ముదురుదోమలు పెరిగాయి. జనాన్ని రాచి రంపాన పెడుతున్నాయి. దోమల నిర్మూలనకు ఫాగింగ్ చేయడం లేదు, మురికికాలువల్లో పూడిక తీసే పనులు అంతంత మాత్రంగానే జరుగుతున్నాయి. నగరంలోని మురికివాడల్లోనే కాదు ప్రధాన ప్రాంతాలలో కూడా కుక్కలు, పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. నగరంలో పారిశుద్ధ్యం పనులు చాలా మందకొడిగా సాగుతున్నాయి. అసలు నగరంలో కార్పొరేషన్ పని చేస్తుందన్న ఆనవాళ్లే లేకుండా పోతుంది.

## తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో రఘు



నెల్లూరీయుడు, పశ్చిమగోదావరి జిల్లా ఉపకార్మిక కమీషనర్ రాచ పాళెం రఘు పేరు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ హైదరాబాద్ ఆంధ్రప్రదేశ్‌లో 2014వ సంవత్సరానికి రికార్డు చేశారని జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చింతపట్ల వెంకాచారి తెలిపారు. సమాజంలోని మూఢనమ్మకాలను పారదోలడానికి తన ఇంద్రజాల ప్రదర్శనల ద్వారా బాబాలు చేసే మహిమలు అన్నీ మ్యాజిక్కులేనని విశదపరుస్తూ ప్రజలను చైతన్యపరచడం అభినందనీయమని, గత 40ఏళ్ళుగా రఘు చేస్తున్న సామాజిక సేవకు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ గుర్తించి రఘుకు చోటు కల్పించిందన్నారు.

## బ్లడ్‌బ్యాంక్ ఇన్‌ఛార్జ్‌గా ఈదూరు



రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ కన్వీనర్‌గా డాక్టర్ ఈదూరు సుధాకర్ ఈ నెల 17న బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్లడ్‌బ్యాంక్‌లో రక్తనిల్వలు పెంచడానికి కృషి చేస్తానన్నారు. ఏ సమయంలో ఎవరు ఆపదమీద వచ్చినా రక్తం అందుబాటులో ఉంచేలా చేస్తానన్నారు. రక్తదానంపై ప్రజలలో అవగాహన తీసుకొచ్చి విరివిగా రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేస్తామని, రక్తం కొరతతో ఏ రోగి ఇబ్బంది పడకుండా చూస్తామన్నారు. బ్లడ్‌బ్యాంకులో గతంలో జరిగిన తప్పులను పునరావృతం కానీయమన్నారు. కావలి, ఆత్మకూరు, ఉదయగిరి ప్రాంతాల్లో రక్తనిల్వకేంద్రాల పనితీరును ప్రతినెల సమీక్షిస్తానన్నారు.

## ఓటు గడువు పెంపు

ఓటు దరఖాస్తు గడువును ఈ నెల 23 వరకు పొడిగించారు. మొదట ఈ నెల 10వతేదీ వరకే గడువు ఉండగా 17వరకు పొడిగించారు. ఇప్పుడు దానిని 23 వరకు పెంచారు. వచ్చే ఏడాది దేశ వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలు జరుగనున్నాయి. ఈ నేపథ్యంలో అర్హతగల వారందరికీ ఓటు హక్కు కల్పించాలనే ఉద్దేశ్యంతో ఈ గడువును పొడిగించారు.

## చేనేత, హస్తకళల ప్రదర్శన



హస్తకళల ప్రదర్శనను తిలకిస్తున్న ఆనం వివేకానందరెడ్డి

నెల్లూరులోని వాయుగండ్ల బ్రహ్మయ్య కల్యాణ మండపంలో ఈనెల 15న నెల్లూరు గ్రామీణ శాసనసభ్యులు ఆనం వివేకానందరెడ్డి హస్తకళలు, చేనేత వస్త్ర ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబాలైన హస్తకళలను, చేనేత వస్త్రాలను సమాదరించి కళాకారులను ప్రోత్సహించాలని పేర్కొన్నారు. ఈ ప్రదర్శనలో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారుల ఉత్పత్తులు అందరినీ ఆకర్షిస్తున్నాయి. చేనేతవస్త్రాలు, బెడ్‌షీట్లు, హస్తకళావస్తువులు అద్భుతరీతిలో అలరారుతున్నాయి.

## ఓటుహక్కు అవగాహన సదస్సు



సదస్సులో ప్రసంగిస్తున్న జేసీ లక్ష్మీకాంతం

నెల్లూరు, ఆదిత్యనగర్‌లోని ఆదిత్య కళాశాల ప్రాంగణంలో ఈ నెల 17న ఓటుహక్కు – అవగాహన సదస్సును నిర్వహించారు. సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న జాయింట్ కలెక్టర్ బి.లక్ష్మీకాంతం మాట్లాడుతూ ఓటరుగా అర్హతగల అందరూ నమోదు చేసుకోవాలని, ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని తెలిపారు. 1-1-2014 నాటికి 18సంవత్సరాలు నిండినవారు ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. విశిష్టఅతిథిగా పాల్గొన్న ఆచార్య ఆదిత్య మాట్లాడుతూ ఓటు హక్కును కోల్పోకూడదని, ఓటు హక్కును ఉపేక్షించకూడదని, అమ్ముకోకూడదని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ యం.కృష్ణ, ప్రిన్సిపాల్ డి.పుల్లయ్య, నగర ప్రముఖులు యం.నాగిరెడ్డి, విజయరామచౌదరి, సీతారామస్వామి, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## వైభవంగా చండీహోమం

నెల్లూరు మూలాపేటలోని శంకరమఠంలో పౌర్ణమిని పురస్కరించుకుని మంగళవారం చండీహోమాన్ని వైభవంగా నిర్వహించారు. వేదపండితులు శంకరాచార్యులు వారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. దుర్గామాతను కొలువుదీర్చారు. శాస్త్రోక్తంగా హోమం గణపతిపూజ, పుణ్యాహవచనం, గణపతి, సుబ్రహ్మణ్యేశ్వర, నవగ్రహ, చండీహోమాలు జరిగాయి. పూర్ణాహుతి అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మఠం మేనేజర్ కొర్రపాటి నందకిషోర్ దంపతులు, బ్రాహ్మణ సంఘాల ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

## వీఆర్‌ఏలకు ఉద్యోగోన్నతి

నెల్లూరుజిల్లాలోని వివిధ ప్రాంతాల్లో గ్రామరెవెన్యూ సహాయకులు (వీఆర్‌ఏలు)గా పనిచేస్తున్న 11మందికి గ్రామ రెవెన్యూ అధికారులుగా (వీఆర్‌ఓలు) ఉద్యోగోన్నతి కల్పిస్తూ సోమవారం జిల్లాకలెక్టర్ ఎన్.శ్రీకాంత్ ఉత్తర్వులు జారీచేసారు.

కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ శ్రీకాంత్ జాయింట్ కలెక్టర్ లక్ష్మీకాంతం సమక్షంలో లక్కీడ్రా నిర్వహించారు. లక్కీడ్రా ద్వారా వారికి ప్రాంతాలను కేటాయించారు. అందుకు సంబంధించిన ధృవీకరణ పత్రాలను అందజేశారు. 11మందిలో 10మంది మాత్రమే హాజరయ్యారు.

## ఏ.సి.స్టేడియం వాకర్స్‌కు... ఇంటర్నేషనల్ అవార్డులు



అవార్డునందుకుంటున్న రాఘవేంద్రశెట్టి

విజయవాడ మొగల్‌రాజపురంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో ఈనెల 14, 15 తేదీల్లో జరిగిన 27వ వాకర్స్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్‌లో నెల్లూరు ఏ.సి.సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్‌కు అవార్డులు బహూకరించారు. ఒంగోలు, గుంటూరు, నెల్లూరు జిల్లాలలో వున్న వాకర్స్ అసోసియేషన్‌లలో ఏసి సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ మేటిగా నిలిచి ఉత్తమ క్లబ్, ఉత్తమ సర్వీస్‌క్లబ్, అవార్డులతో పాటు 10,000రూ॥ల నగదు బహుమతిని పొందింది. ఈ అవార్డులను అసోసియేషన్ అధ్యక్షులు ఎస్.రాఘవేంద్ర శెట్టి, కార్యదర్శి నలుబోలు బలరామయ్యనాయుడులకు వాకర్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ డా॥యం.వి.రావు, 203డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎస్.రామ్మోహన్‌రావులు అందించారు. కార్యక్రమంలో వాకర్స్ డా॥కె.అంకిరెడ్డి, ఏ.సి.నరసింహం, పూండ్ల పిచ్చిరెడ్డి, జి.ఓబులురెడ్డి, వి.రంగారావు, బి.శేషగిరిరావు, టి.నారాయణరావు, ఏ.దశయ్య, ఎల్.చంద్రమౌళిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అమరజీవి 61వ వర్ధంతి



అమరజీవికి నివాళులర్పిస్తున్న చర్మకారులు

నెల్లూరు నవాబుపేట కుసుమ హరిజనవాడలో ఈనెల 15న చర్మకారుల సంక్షేమసంఘం ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు మన్నేపల్లి దాసు తదితరులు పొట్టి శ్రీరాములు ఛాయా చిత్రానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. తదుపరి పేదలకు దుప్పట్లు, వస్త్రాలు పంపిణీచేసి, అన్నదానం చేసారు. ఈ సందర్భంగా దాసు మాట్లాడుతూ హరిజనులు దేవాలయాలలోకి ప్రవేశించేలా ఆనాడు పొట్టిశ్రీరాములు అమోఘమైన కృషి చేసారన్నారు. అందుకే హరిజనులకు అంబేద్కర్, పొట్టిశ్రీరాములు ఆరాధ్య దైవాలని కొనియాడారు. ఆ మహనీయుడు ఆశయసాధనలో పట్టువదలని విక్రమార్కుడిలా పనిచేసి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించాడని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ సామాజిక సేవాసంస్థల గౌరవ అధ్యక్షుడు ముదిగొండ శ్రీనివాస్ సుందరరాజ్, పూటుకూరు సురేష్, రాయపు వెంకటేశ్వర్లు, పోలయ్య, ఎంబేటి మోహన్ పాల్గొన్నారు.

## అటవీ సిబ్బందికి ఆయుధాలు ఇవ్వాలి



అమరవీరుల స్థూపం వద్ద మాట్లాడుతున్న నాగేశ్వరరావు

అటవీ సిబ్బందికి ఆయుధాలు ఇస్తేనే విధులు నిర్వర్తించగలమని నెల్లూరుజిల్లా అటవీశాఖాధికారి ఎన్.నాగేశ్వరరావు పేర్కొన్నారు. చిత్తూరుజిల్లా శేషాచలం అడవుల్లో స్మగ్లర్ల దాడిలో ప్రాణాలు వీడిన అటవీశాఖ డిఆర్వో శ్రీధర్, ఏబీఓ డేవిడ్ కరుణాకర్‌కు సోమవారం నగరంలోని అటవీశాఖ కార్యాలయంలో అధికారులు, సిబ్బంది నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా డిఎఫ్‌ఓ మాట్లాడుతూ స్మగ్లర్లను ఎదుర్కొనేందుకు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగుదామన్నారు. వీలైనంత త్వరగా అటవీ సిబ్బందికి ఆయుధాలు వచ్చేందుకు తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుగంగ అటవీ విభాగం డిఎఫ్‌ఓ జయచంద్రారెడ్డి, జూనియర్ ఫారెస్ట్ అసోసియేషన్ నాయకులు బాలు, శ్రీను, జనార్ధన్, సిబ్బంది పాల్గొన్నారు.

PDF Compressor Free Version



# జెన్‌కోకు లైన్ క్లియర్

సింహపురి సమాచారం

ముత్తుకూరు మండలం నేలటూరు వద్ద నిర్మిస్తున్న 1600 మెగావాట్ల దామోదరం సంజీవయ్య సూపర్ క్రిటికల్ జెన్‌కో థర్మల్ పవర్ స్టేషన్‌లో విద్యుత్ ఉత్పత్తికి ప్రధాన అడ్డంకి తొలగిపోయింది. తొలిదశలో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి అంతా రంగం సిద్ధమైంది. వచ్చే మార్చి నుండి విద్యుదుత్పాదన మొదలు పెట్టాలని ప్రయత్నిస్తున్నారు. అయితే ఇక్కడ యాష్‌పాండ్ నిర్మాణం పెద్ద అడ్డంకిగా మారింది. ఇక్కడ యాష్‌పాండ్ నిర్మిస్తే తమ గ్రామాలు కాలుష్యం బారినపడతాయని, నీళ్లు కలుషితమవుతాయని స్థానికులు అభ్యంతరం పెట్టారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో జెన్‌కో ఇంజనీర్లు యాష్‌పాండ్ పనులు ప్రారంభిస్తే, స్థానికులు యాష్‌పాండ్ వ్యతిరేక పోరాటకమిటీగా ఏర్పడి ట్రిబ్యునల్‌లో దీనిపై స్టే తెచ్చారు. దీంతో జూన్ 6 నుండి యాష్‌పాండ్ పనులు నిలిపేసారు. అప్పటి నుండి యాష్‌పాండ్‌పై ఇరువర్గాల వాదనలు కొనసాగాయి. చెన్నై గ్రీన్ ట్రిబ్యునల్ కోర్టు ఈ కేసును విచారించి తీర్పును రిజర్వ్‌లో వుంచింది. 17వ తేదీన న్యాయమూర్తులు జ్యోతిమణి, నాగేంద్రన్‌లు ఢిల్లీ నుండి చెన్నైలోని ట్రిబ్యునల్‌కు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తీర్పును వెలువరించారు. ప్రాజెక్ట్ కోసం సేకరించిన భూముల్లో జెన్‌కో ఎటువంటి పనులైనా చేపట్టవచ్చని, దీని కోసం ప్రజాభిప్రాయం సేకరించాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పారు. దీంతో యాష్‌పాండ్ నిర్మాణానికి దారులు తెరచుకున్నట్లయ్యింది.

# రైతులను మోసం చేస్తున్నారు

## ఆదాలపై మండిపడ్డ కాకాణి



వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఈనెల 15న పొదలకూరు పర్యటనలో మాట్లాడుతూ సర్వేపల్లి ఎమ్మెల్యే ఆదాల ప్రభాకరరెడ్డిపై విరుచుకుపడ్డారు. పొదలకూరు మండలం చాటగొట్ల గ్రామ సమీపంలో కండలేరు జలాశయంలో ముంపునకు గురై ఇళ్ళు కోల్పోయిన వారికి ఇళ్ళస్థలాలు కేటాయించకుండా ఆదాల ప్రభాకరరెడ్డి అనుచరులు ముంపు బాధితులు కాని వారికి కేటాయించారని పేర్కొన్నారు. దాంతో ముంపు బాధితులు కొందరు న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సి వచ్చిందని అన్నారు. పొదలకూరు ఎడమ కాలువ నుంచి నీరు సరఫరా చేసి పంటలు కాపాడతామని చెప్పి మోటారు ద్వారా కాలువకు నీరు సరఫరా చేయడంతో పంట చివరదశలో పంటలు ఎండిపోయాయన్నారు. ఒక్క ఎకరం కూడా ఎండనీయమని చెప్పిన ఆదాల మాటలు విని రైతులు వరిపంట సాగుచేసారన్నారు. దాంతో లింగంపల్లి, అయ్యగారిపాలెం, ఇనకుర్తి, ముదిగేడు, మర్రిపల్లి గ్రామాల రైతులు పంటలు ఎండిపోయి నష్టపోయారన్నారు. ప్రభుత్వం నుంచి 75లక్షలు నిధులు మంజూరు చేయించుకునేందుకు ఆదాల ప్రయత్నిస్తున్నారని అన్నారు. నీరందక నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాల్సిన బాధ్యత ఆదాల ప్రభాకరరెడ్డిపై వుందని పేర్కొన్నారు.

# మోసపూరితంగా విభజన




అత్యంత మోసపూరితంగా కేంద్రప్రభుత్వం రాష్ట్ర విభజనకు పూనుకుందని సమైక్య ఉద్యమనేత ఆనం జయకుమార్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేసారు. ఈ నెల 17వ తేదీన ఆయన ఆధ్వర్యంలో పెద్దబజారు కూడలి నుండి ములుమూడి బస్టాండ్ వరకు కాగడాల ప్రదర్శన జరిగింది. ఈ ప్రదర్శనలో పాల్గొన్న కార్యకర్తలు 'సోనియా డౌన్‌డౌన్', 'సేవ్ ఆంధ్రప్రదేశ్' అంటూ నినాదాలు చేసారు. ఈ సందర్భంగా కార్యకర్తలనుద్దేశించి ఆనం జయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్‌పార్టీ తన సొంత ప్రయోజనాల కోసమే రాష్ట్రాన్ని చీలుస్తుందన్నారు. సీమాంధ్ర కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఎప్పుడో రాజీనామా చేసి ఉంటే రాజ్యాంగ సంక్షోభం ఏర్పడి విభజన ఆగేదన్నారు. వీళ్ళు రాజీనామాలు చేయకుండా సీమాంధ్ర ప్రజలను మోసం చేసారన్నారు. సీమాంధ్ర నేతలంతా తెలుగుజాతి ఆత్మగౌరవాన్ని సోనియా వద్ద తాకట్టుపెట్టారని విమర్శించారు. ఇప్పుడైనా సీమాంధ్ర నేతలు తెలంగాణ బిల్లును ఓడించి తెలుగుప్రజల ఆగ్రహానికి గురికాకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కె.బాబునాయుడు, జి.జయకుమార్, ఆర్.శ్రీనివాసరావు, ఏసునాయుడు, అశోక్, మోహనాచారి, షఫీ, ఆసిఫ్‌పాషా, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రంగడి హుండీ లెక్కింపు

నెల్లూరులోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి ఆలయ హుండీని ఈ నెల 17వ తేదీన లెక్కించారు. సెప్టెంబర్ 14 నుండి డిసెంబర్ 17 వరకు హుండీ ద్వారా 4,45,921 రూపాయల ఆదాయం లభించింది. హుండీ లెక్కింపు కార్యక్రమాలలో ఇఓ పాయసం నాగేశ్వరరావు, ఛైర్మన్ దుగ్గిశెట్టి భారతి, ఆలయ ప్రధానార్చకులు జగన్నాదాచార్యులు, సభ్యులు పాల్గొన్నారు.

# తెలంగాణ బిల్లును స్పీకర్ వెనక్కు పంపాలి



రాజకీయలబ్ధి కోసం కేంద్ర ప్రభుత్వం పంపిన తెలంగాణ బిల్లును స్పీకర్ వెనక్కు పంపాలని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేసారు. విభజనబిల్లుపై శాసనసభ అభిప్రాయం తెలిపేందుకు రాష్ట్రపతి ఆరువారాలు సమయం ఇస్తే ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు పంపడ మేమిటని ప్రశ్నించారు. ఆ బిల్లులో నాలుగు నియోజకవర్గాల పేర్లనే పేర్కొన లేదన్నారు. తెలుగు ప్రజలను విడగొట్టే బిల్లును ఆమోదింపజేసుకునేందుకు సంప్రదాయాలను పక్కనపెట్టి స్పీకర్‌ను పావుగా వాడుకుంటున్నారని ధ్వజమెత్తారు. సీమాంధ్రకు చెందిన స్పీకర్ ఈ ప్రాంత ప్రజల మనోభావాలకు విరుద్ధంగా వ్యవహరించడం దురదృష్టకరమన్నారు. తండ్రి నాదెండ్ల భాస్కరరావు బాటలో నడవకుండా సభా సాంప్రదాయాల ప్రకారం స్పీకర్ నడుచుకోవాలనుకోరారు.

# ఐక్యత పరుగులో ఉప్పొంగిన దేశభక్తి

గుజరాత్‌లో సర్దార్‌వల్లభాయ్‌పటేల్ విగ్రహనిర్మాణ యజ్ఞంలో భాగంగా నెల్లూరులో ఆదివారం ఉదయం ఐక్యత పరుగు(2కెరన్)కు శ్రీకారం చుట్టారు. రన్ ఫర్ యూనిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి పిలుపునందుకున్న సింహపురి యువత సింహగర్జనలా భరతమాతకు జై కొట్టింది. మేము సైతం అంటూ 16ఏళ్ళ యువత నుంచి 70ఏళ్ళ వృద్ధుల వరకు ఉప్పొంగిన దేశభక్తితో నెల్లూరునగర రోడ్లన్నీ కిక్కిరిసాయి. అధిక సంఖ్యలో ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు, పలు ప్రజా సంఘాలు పార్టీలకు అతీతంగా ముందుకు సాగారు. రన్ ఫర్ యూనిటీ కమిటీ ఛైర్మన్ సిఎస్ ఆర్ కోటారెడ్డి, జిల్లా కోఆర్డినేటర్, భారతీయ జనతాపార్టీ రాష్ట్ర కార్యదర్శి కాకు విజయలక్ష్మి నెల్లూరు టౌన్‌హాలులోని వేదిక వద్ద నరేంద్రమోడి జాతిని ఉద్దేశించి మాట్లాడిన ప్రసంగాన్ని లైవ్ ద్వారా ప్రసారంచేసారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా రాజకీయాలకు అతీతంగా ఒకే రోజున, ఒకే సమయంలో పరుగును ఇది మహాయజ్ఞంగా చేపట్టాలని నరేంద్రమోడి పిలుపునిచ్చారని, ఆ పిలుపును అందుకుని సింహపురిలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని వివరించారు. ఈ యువత పరుగు గిన్నీస్ రికార్డ్సను ఎక్కుతుందన్నారు. దాదాపు ఒకటిన్నర గంట పాటు ఉద్వేగం మధ్య దేశభక్తిని చాటుతూ త్యాగాలకు మేము సై అని నిరూపిస్తూ నెల్లూరు యువత తీసిన ఈ పరుగు నెల్లూరు టౌన్‌హాలు నుండి ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, మిడతల రమేష్, ఎ.రామయ్య, భాస్కర్‌గౌడ్, ఎం.సురేష్ తదితరుల సమక్షంలో ఆచార్య ఆదిత్య, జెన్ని రమణయ్య పచ్చజెండా వూపి పరుగును ప్రారంభించారు. ఈ పరుగు విఆర్‌సి సెంటర్, ఆచారివీధి, పెద్దబజార్, చిన్నబజార్ మీదుగా ఏసి సెంటర్, గాంధీబొమ్మ సెంటర్ వరకు సాగింది.

# కెకెఆర్ విద్యార్థులను అభినందించిన జిల్లా ఎస్పీ

నెల్లూరు మాగుంటలేఅవుట్‌లోని కెకెఆర్ గౌతం ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థులు జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపికైనందుకు నెల్లూరు జిల్లా ఎస్పీ పివీయస్ రామకృష్ణ మంగళవారం తన కార్యాలయంలో చిన్నారులను అభినందించారు. ఒకినావా కరాటే అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి1, 2, 3 తేదీల్లో నెల్లూరు టౌన్‌హాల్లో జరుగనున్న జాతీయస్థాయి కరాటే పోటీలకు తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు అండర్-8, 10, 12 కేటగిరిలో కమిటీ విభాగంలో 32 మంది ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపల్ ఉదయ్‌భాస్కర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రైమరీ స్కూల్ ప్రిన్సిపల్ ఎ.లావణ్య, కరాటే మాస్టర్ షేక్‌ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

## నివాళి



పేదల మనిషిగా, ఎంతోమంది
న్యాయవాదులను తీర్చిదిద్దిన మహామనీషిగా
నెల్లూరుజిల్లా న్యాయవ్యవస్థలో గుర్తింపు తెచ్చుకున్న

**మలిరెడ్డి కృష్ణప్రసాద్ గారి**

మృతికి చింతిస్తూ... వారి కుమారులు

**మలిరెడ్డి శ్రీనివాసులరెడ్డి గారికి**

**మలిరెడ్డి కోటారెడ్డి గారికి**

ఇతర కుటుంబసభ్యులకు

మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాం...

**ఆప్తులు, ఆత్మీయులు.**

PDF Compressor Free Version



# కిరణ్ గోడౌన్‌లో టి-బిల్లు బండిల్స్

గల్పిక

అది గ్యాంగ్‌రేప్‌లకు ఐఎస్ఓ. 9000-2013 సర్టిఫికేట్ పొందిన ఢిల్లీ నగరం. కేంద్ర హోంమంత్రి సుశీల్‌కుమార్‌షిండే నివాసం. తెల్లారుజామున నాలుగు గంటల సమయం. బెడ్‌రూంలో షిండే ఆయన సతీమణి నిద్రపోతున్నారు. ఉన్నట్లుండి షిండే నిద్రలోనే టీ... టీ... టీ... అని అరవసాగాడు. దాంతో ఆయన సతీమణికి మెలకువ వచ్చి తన భర్త టీ అడుగుతున్నాడేమోననుకుని హడావిడిగా వంటింట్లోకి వెళ్లింది. స్టౌ వెలిగించి టీ కాసి టీకప్పును తెచ్చి షిండే చేతిలో పెట్టింది. ఒక్కసారిగా వేయికి సెగతగలడంతో షిండే అదిరిపడి లేచి... టీ కప్పు ఇప్పుడు చేతిలో ఎందుకు పెట్టావని అడిగాడు. మీరే కదా టీ... టీ... అని అడిగారని ఆమె అంది. దానికి షిండే... నేను నిద్రలో కలవరించి వుంటాను. టీ అంటే తాగే టీ కాదే పిచ్చిమొహమా... టీ అంటే తెలంగాణ బిల్లు. రాత్రంతా మా మేడమ్‌తో అదే విషయమై మాట్లాడివచ్చాను. కాబట్టి నిద్రలో కూడా దాని గురించే కలవరించి వుంటాను అని చెప్పి మళ్లీ పడుకోబోయాడు. అంతలో ఆయన సెల్‌ఫోన్ మోగింది. టెన్‌జనపథ్ నుండి పిలుపు... మేడమ్‌గారు మిమ్మల్ని వెంటనే రమ్మన్నారని. ఇంకేముంది ఆ నైట్‌డ్రెస్ మీద అలాగే బయలుదేరాడు.

★★★★★

అది రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ దిగ్విజయ్‌సింగ్ ఇల్లు. సమయం నాలుగున్నర గంటలు. ఆయన బెడ్‌రూంలో అటు ఇటు తిరుగుతూనే వున్నాడు. అది చూసి ఆయన భార్య... ఏమండీ రాత్రి నుండి పడుకోకుండా అలాగే తిరుగుతున్నారు. దేనికోసం అంత టెన్షన్ పడుతున్నారని అడిగింది. దానికి దిగ్విజయ్... తెలంగాణ బిల్లును ఆమోదించే దాకా మాకు నిద్రలేదు, నీళ్లు లేవు, తిండి లేదు. టీ-బిల్లు కోసమే మా టెన్షన్ అంతా అని చెప్పాడు. సరే బాత్రూంకు వెళ్లిరండి... టీ తెస్తాను అని ఆమె అంది. టీ నువ్వు తేవడం ఏంటీ, మేం కదా టీ-బిల్లు తెచ్చేది అని దిగ్విజయ్ అన్నాడు. అందుకామెకు మండి... మీ మొహం మీద టీ పొయ్యా... నేననేది తాగే టీ గురించి... మీ తెలంగాణ బిల్లు గురించి కాదు అంటూ వంటింట్లోకి పోయింది. దిగ్విజయ్ బాత్రూంలోకి వెళ్లి టాయ్‌లెట్‌లో కూర్చున్నాడు. అంతలో బయట ఫోన్ మోగింది. దిగ్విజయ్‌సింగ్ సతీమణి ఫోన్ ఎత్తింది. దిగ్విజయ్‌ను అర్జంట్‌గా రమ్మని టెన్‌జనపథ్ నుండి పిలుపు. అదే విషయాన్ని టాయ్‌లెట్‌లో వున్న దిగ్విజయ్‌కు ఆమె అరచిచెప్పింది. టెన్‌జనపథ్ నుండి పిలుస్తున్నారు. తెలంగాణ బిల్లు గురించి మాట్లాడాలంట అని ఆమె చెప్పగానే దిగ్విజయ్ సగంలోనే లేచొచ్చాడు. ఏమండీ నీట్‌గా రెడీ అయ్యి వెళ్లండని ఆమె చెబుతున్నా వినుకోకుండా ఆ హడావిడిలో ఫ్యాంట్ మీద డ్రాయర్ వేసుకుని సూపర్ మెన్ మాదిరిగా రయ్‌మంటూ టెన్‌జనపథ్‌కు చేరుకున్నాడు.

అక్కడ సోనియా, రాహుల్, ఆంటోని, అంబికా సోని, పి.సి.చాకో, షిండే, దిగ్విజయ్‌సింగ్‌లు ఉన్నారు. సోనియా వుండి... రాత్రంతా నాకు నిద్రపట్టలేదు... నిన్న ఒక్క రాత్రే కాదు, ఈమధ్య కాలంలో నాకు సరిగా నిద్ర వుండడం లేదు. నిన్న మానసిక వైద్యుడు వచ్చి నన్ను పరీక్షించాడు. నా మానసిక స్థితిని పసిగట్టాడు. ఆంధ్రప్రదేశ్‌ను ఎంత త్వరగా చీలిస్తే నేను అంత తొందరగా కోలుకుంటానట. నాకు నిద్రపట్టాలన్నా, తిండి తినాలన్నా వెంటనే తెలంగాణ ఏర్పాటు చేయాలన్నారు. మీరు వెంటనే ఆ పని పూర్తి చేసి నాకు మనశ్శాంతిని కలిగించండి అని వేడుకుంది. అప్పుడు ఆంటోని వుండి... మేడమ్, ఒక రాష్ట్రాన్ని ఏర్పాటు చేయాలంటే కొన్ని పద్ధతులుంటాయి, వాటిని మనం ఫాలో కావాలి. ఇరు ప్రాంతాలకు నష్టం కలుగకుండా, ప్రజలు భావోద్రేకాలకు గురికాకుండా చూడాలి అని అన్నాడు. ఇక్కడ దిగ్విజయ్‌సింగ్‌కు మండింది. నీకు మేడమ్ మనశ్శాంతి ముఖ్యమా, ప్రజలు ముఖ్యమా... అసలు నువ్వు కాంగ్రెస్ లీడర్‌వేనా? కమ్యూనిస్టువా? ఇక్కడ మేడమ్ మనకు ఇంపార్టెంట్, ఆ ఆంధ్రా జనాలు ఎక్కడ ఛస్తే మనకేం... ఏ విధంగా పోతే మనకేం... ఇప్పుడే టీ-బిల్లును తయారుచేయండన్నాడు. అందుకు ఆంటోని... టీ-బిల్లును తయారు చేయడమంటే కాకా హోటల్‌లో టీ-బిల్లు రాసిచ్చినంత ఈజీ కాదు. దీనికి రాజ్యాంగాన్ని చూడాలి, చట్టాన్ని చదవాలి, మూడు భాషల్లో బిల్లు కాపీలను తయారుచేయాలి... అని చెప్పాడు. అప్పుడు షిండే కలుగజేసుకుని.. అవన్నీ పద్ధతిగా రాష్ట్రాలను ఏర్పాటు చేయాలనుకునే వాళ్ళకు... అవన్నీ మనకెందుకు? మేడమ్ కోరింది కాబట్టి మన ఇష్టం వచ్చిన పద్ధతిలో బిల్లును తయారు చేద్దాం. ఇక్కడ రాజ్యాంగం ఇంపార్టెంట్ కాదు, మన మేడం మనశ్శాంతి ఇంపార్టెంట్. మూడు భాషల్లో బిల్లును రెడీ చేయకుంటే కొంపలంటుకుపోవు. ఏ భాషలో బిల్లు ఇచ్చినా సీమాంధ్రవాళ్లు చేసేదేమీ లేదు... అసలు ఇటాలియన్ భాషలో బిల్లు తయారుచేసి పంపిస్తాం... అవుతారా? అంటూ అప్పటికప్పుడు అక్కడ కంప్యూటర్‌ను తెప్పించి ఒక ఆపరేటర్‌ను రప్పించాడు. అప్పటికప్పుడు ఇంగ్లీష్‌లో టీ-బిల్లును టైపుచేయించారు. ఎమర్జెన్సీ క్రింద ప్రింటర్‌లు ఏర్పాటు చేసి బిల్లు ప్రతులను తీసారు. దిగ్విజయ్‌సింగ్ వాటన్నింటిని బండిల్స్‌గా చేసి కట్టలు కట్టాడు. వెంటనే హైదరాబాద్‌కు వెళ్లే ఫ్లైట్‌లో వీటిని పంపించమని కేంద్ర హోంశాఖ కార్యదర్శిని ఆదేశించాడు. అయితే అక్కడ షిండే జోక్యం చేసుకుని... ప్యాసింజర్ ఫ్లైట్‌లో పంపిస్తే ఇవి శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుండి అసెంబ్లీకి పోవడానికి చాలా టైం తీసుకుంటుంది. అదే స్పెషల్ ఫ్లైట్ ఏర్పాటుచేస్తే బేగంపేట ఎయిర్‌పోర్ట్‌లో దిగొచ్చు. తొందరగా అసెంబ్లీకి చేరుకోవచ్చన్నాడు. తనకంటే షిండే తొందరపడడం చూసి సోనియాకు ముచ్చటేసింది. ఇలాంటివాళ్లు నలుగురు తన వెనకుంటే ఒక్క ఆంధ్రప్రదేశ్‌నే కాదు, ప్రపంచాన్నే విభజించి తగలబెట్టొచ్చనుకుంది. అనుకున్నట్లే ప్రత్యేకవిమానంలో తెలంగాణబిల్లు బండిల్స్‌ను హైదరాబాద్‌కు పంపించారు.

★★★★★

కేంద్ర హోంశాఖ కార్యదర్శి నేరుగా సచివాలయంలో ముఖ్యమంత్రి ఎన్.కిరణ్‌కుమార్‌రెడ్డిని కలిసారు. ఢిల్లీ నుండి టీ-బిల్లులు వచ్చాయి. ఎక్కడ పెట్టమంటారు? అని అడిగాడు. వెంటనే కిరణ్ లేచి క్రింద కొచ్చాడు. తన వ్యక్తిగత కార్యదర్శి ఎస్.ఎస్. రావత్‌ను పిలిచి ఇప్పుడు ఏ గోడౌన్ ఖాళీగా వుందని అడిగాడు. ఏడో నెంబర్ గోడౌన్‌లో కొంత ఖాళీ వుంది సార్, అని చెప్పాడు. అయితే ఆ గోడౌన్‌లో టీ-బిల్లు బండిల్స్‌ను పెట్టించి వాళ్లకు సీరియల్ నెంబర్ ఇచ్చి పంపు అని కిరణ్ చెప్పాడు. రావత్ '5156' నెంబర్ వున్న టోకెన్‌ను బిల్లు బండిల్స్ తెచ్చిన అధికారికి ఇచ్చాడు. ఆ టోకెన్ చూసి ఆ అధికారి... ఈ నెంబరేంటి అని ప్రశ్నించాడు. మీ సీరియల్ నెంబర్... మా సారు క్లియర్ చేయాల్సిన ఫైళ్లు, 5155 వున్నాయి. అవన్నీ 7గోడౌన్‌లలో వున్నాయి. అవన్నీ చూసిన తర్వాత మీ బిల్లును చూస్తారు అని చెప్పాడు. ఆ మాటకు ఆ అధికారి అలాగే నోరు తెరిచాడు.

★★★★★

## కదంబం

### జీల

రేపటి కలల్ని
రెక్కల పల్లకిలో అలంకరించుకొని
వెండి వెన్నెల సముద్రాలీదుకుంటూ
జీలరేవు చేరుకుంటుంది వలసగువ్వ
పుట్టిన మట్టిని ముద్దాడి
అణువణువూ పులకించిపోతుంది!
మట్టికి నమస్కరిస్తుంది!
మట్టిలో బంధాన్ని నెమరేసుకుంటుంది!
ఈ నేలలో ఆకలిగింజలేరుకున్న క్షణాన్ని
చివిగిపోయినా వాసనకోల్పోని అడుగుజాడన్ని
పుల్లాపుడకా చేర్చి కొమ్మల్లో కట్టిన పాతగూటి ఆనవాళ్ళని
జ్ఞాపకాలపుస్తకం తెరచి పేజీలు తిరగేస్తుంది!
పచ్చని ఆకుల వెచ్చని స్పర్శ
గుండె పొరల్ని సుతారంగా తాకుతుంది!
రెమ్మల్లో రారమ్మని పిలిచే గూటి ఊయల
గాలితో కలిసి జోలపాడుతుంది!
ప్రశాంత నీటి మైదానంలో ఎగిరెగిరి పడుతూ
రంగురంగుల చేపల టింగరి నృత్యాలు
ఏడాదికోమారు వేంచేసే యింటి ఆడపడుచుల కోసం
జీల ఏర్పాటుచేసిన ఆహ్వాన ప్రదర్శన
స్వాగతగీతం పలుకుతున్న ప్రకృతి పచ్చనిబాట!
స్వర్గానికి ఒడ్డు యీ గడ్డ మీది గుడ్లు పొదగను
వలస పక్షుల ఆరాటం చూసైనా మనిషి పాఠం నేర్చుకోడు
బాక్సైట్ తవ్వకాల కోసం బాంబులు పేల్చి
అంతరంగాన్ని కాక
అల్యూమినాన్ని శుద్ధిచేయాలని
విద్యుత్ ఉత్పత్తుల కోసం మట్టిలో మంటలు రేపి
జీలలాంటి తన మనసును బీడు చేసుకుంటున్నాడు
తన పార్థివ దేహాన్ని పాతిపెట్టుకునేందుకు
అభివృద్ధి పేరుతో
ఆరడుగుల గొయ్యి తవ్వుతున్నాడు!

గుర్రాల రమణయ్య,
నెల్లూరు. 99639 21943.

## డా॥ సి.భవానీదేవికి పెన్నా సాహిత్య పురస్కారం



పెన్నా రచయితల సంఘం నాల్గవ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 1ఏన నెల్లూరు టౌను హాలులో ప్రముఖ కవయిత్రి డా॥ సి.భవానీదేవికి పెన్నా సాహిత్య పురస్కారం -2013 అందించి ఘనంగా సత్కరించారు. నెల్లూరు నగర శాసన సభ్యులు ముంగమూరు శ్రీధర కృష్ణారెడ్డి, డా॥ పెళ్ళకూరు జయప్రద, మోపూరు పెంచలనరసింహం, గుండాల నరేంద్ర బాబు, షంషుద్దీన్, జి.సుభద్రాదేవి, ఇంద్రగంటి మధుసూదన్, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు. తదుపరి సలహైమండి నెల్లూరుజిల్లా కవులు రచించిన "పెన్నాకలాలు" కవితా సంకలనం, వర్ధమానకవి అవ్వారు శ్రీధర్‌బాబు రచించిన "పూలతివాచీ" కవితా సంపుటి, దామెర్లగీత, మోపూరు పెంచల నరసింహంలు రచించిన "వెన్నెలవర్షం" నవలలను ఆవిష్కరించారు.

## "పాతాళగరిగె" ఆవిష్కరణ



వర్ధమాన రచయిత, కవి తోకల రాజేశం రచించిన సాహిత్యవ్యాసాల సంపుటి "పాతాళగరిగె"ను ఇటీవల మంచిర్యాలలోని విశ్వనాథ ఆలయ కాలక్షేప మంటపంలో తెలంగాణా రచయితల వేదిక ఆధ్వర్యంలో ప్రసిద్ధ నవలారచయిత అల్లం రాజయ్య ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా ప్రఖ్యాత కవి, విమర్శకులు నందిని సిధారెడ్డి, ప్రముఖ కవి, విమర్శకులు గోపగాని రవీందర్, తెరవే అధ్యక్షుడు తోటపల్లి భూమన్న తదితరులు పాల్గొన్నారు.

## 22న కవి సమ్మేళనం

నెల్లూరు టౌనుహాలు రీడింగ్ రూంలో ఈనెల 22న స్వామి వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో కవి సమ్మేళనం జరుగుతుందని సమితి అధ్యక్షులు ఆచార్య ఆదిత్య, ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాసులునాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. "స్వామి వివేకానంద జీవితం - సందేశం" అంశంపై 30పంక్తులకు మించని వచన కవితలు, గేయాలు, పద్యాలు, కవులు తీసుకురమ్మని వారు ఆహ్వానిస్తున్నారు.

## వాకర్స్ గవర్నర్‌గా సుబ్బారెడ్డి



విజయవాడలోని సిద్ధార్థ ఆడిటోరియంనందు ఈ నెల 15 ఆదివారం జరిగిన 27వ వాకర్స్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు యం.వి.రావు 2014 సంవత్సరానికి వాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా 203కి గవర్నర్‌గా నెల్లూరు నేతాజీ సైలట్ హైస్కూల్ కరస్పాండెంట్ యం.వి.సుబ్బారెడ్డిని ఎంపికచేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు సుబ్బారెడ్డిని అభినందించారు. సుబ్బారెడ్డి గత 25సం॥ లుగా జిల్లాలో చేస్తున్న వివిధ సేవా కార్యక్రమాలకు గుర్తింపుగా యం.వి.రావు ఈ పదవిని అందజేశారు.

## విద్యార్థి సంఘాల ఆందోళన

రాష్ట్ర అసెంబ్లీలో తెలంగాణా బిల్లును ప్రవేశపెట్టడాన్ని నిరసిస్తూ మంగళవారం విద్యార్థి ఐకాస ఆధ్వర్యంలో జిల్లాలో విద్యాసంస్థల బంద్ ప్రశాంతంగా సాగింది. ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలను మూయించారు. తెలంగాణా బిల్లులను అడ్డుకోవడంలో ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి విఫలమయ్యారని ప్లకార్డులు ప్రదర్శించారు. రాష్ట్రం విడిపోతే అడుక్కోవల్సిన పరిస్థితి వస్తుందని రోడ్లపై భిక్షాటన సాగించారు.

PDF Compressor Free Version



# నెల్లూరు అసెంబ్లీ స్థానం ముస్లింలకు కేటాయించాలి

2014ఎన్నికల్లో నెల్లూరు అసెంబ్లీ స్థానాన్ని ముస్లింలకు కేటాయించాలని ఆల్ ఇండియా ఇమామ్స్ కౌన్సిల్ జిల్లా శాఖ అధ్యక్షప్రధాన కార్యదర్శులు మౌలానా అబ్దుల్ సుబహాన్, షేక్ అబ్దుల్ రహమాన్, షేక్ అబ్దుల్ అజీజ్‌లు డిమాండ్ చేసారు. సోమవారం నెల్లూరు ప్రెస్‌క్లబ్‌లో రహమాన్ విలేకర్లతో మాట్లాడారు. దాదాపు 42వేల 67మంది ముస్లిం ఓటర్లు ఉన్న నెల్లూరు నగర శాసనసభ నియోజకవర్గాన్ని ముస్లింలకు కేటాయించాలన్నారు. నెల్లూరు నగర స్థానాన్ని కేటాయించే ఏ పార్టీకైనా బేషరుతుగా జిల్లాలోని మిగిలిన తొమ్మిది నియోజకవర్గాల్లో ముస్లిం ఓటర్లు ఆ పార్టీ గెలుపుకు కృషి చేస్తార న్నారు. బీజేపీ మినహాయించి ఏ పార్టీ ఇచ్చినా తాము ఆ పార్టీ తరపున పోటీ చేస్తామన్నారు. ఏ పార్టీ ముస్లింలకు టికెట్ ఇవ్వకుంటే నెల్లూరు నగర, రూరల్‌తో పాటు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఆల్ ఇండియా ఇమామ్స్ కౌన్సిల్ తరపున ముస్లిం అభ్యర్థులు పోటీ చేస్తారన్నారు. ఈ సమావేశంలో కౌన్సిల్ సభ్యులు మౌలానా జైనులబ్దిన్, సయ్యద్ మౌలానా జలాలుద్దీన్‌సాహెబ్, మౌలానా కిఫాయతుల్లా, మౌలానా అబ్దుల్ హాఫీజ్, మౌలానా జహీరుద్దీన్ పాల్గొన్నారు.

## నేటి యువత...

# వివేకానందుని ఆదర్శంగా తీసుకోవాలి

**నెల్లూరు నగర డిఎస్పీ వెంకటనాథ్‌రెడ్డి**



నేటి యువత వివేకానందుని ఆదర్శంగా తీసుకోవాలని నెల్లూరు నగర డిఎస్పీ వెంకటనాథ్‌రెడ్డి అన్నారు. స్వామి వివేకానంద జయంతిని పురస్క రించుకుని పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం పాఠశాలల్లోని విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలు నిర్వహిం చారు. నెల్లూరు టౌన్‌హాలు వర్ధమాన సమాజ గ్రంథాలయం పైభాగంలోని రీడింగ్ రూంలో సభ నిర్వహించారు. వివేకానందుని చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డిఎస్పీ మాట్లా డుతూ ప్రపంచంలోని మానవులందరూ రాగద్వేషాలకు అతీతంగా ప్రశాంతంగా జీవించాలని కోరుకుని తన జీవితాన్ని విశ్వమానవ ప్రేమకు అంకితం చేసిన మహనీయుడు స్వామి వివేకానంద అని అన్నారు. వివేకానందుడు ఉన్నతమైన భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పారన్నారు. అనంతరం పోటీల్లో పాల్గొన్న విజేతలకు బహుమతులు ప్రదానం చేసారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మురళీమోహన్‌రాజు, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

# కండలేరు నీటి తరలింపుపై ప్రజావ్యాజ్యం


కండలేరు నుంచి చిత్తూరుకు నీటిని తరలించడంపై ప్రజావ్యాజ్యాన్ని వేయనున్నట్లు తెలుగుదేశంపార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి అన్నారు. ఈనెల 15న నెల్లూరుజిల్లా ముత్తుకూరు మండలం ముసునూరువారిపాలెంలో గడపగడపకు తెలుగుదేశంపార్టీ కార్యక్రమాన్ని ప్రారంభించి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ అధికారపార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు ప్రజాసమస్యలు పట్టించుకోవడంలేదని తెలుగుదేశంపార్టీ పాలనలో 90పైసలకే ఆక్వారైతులకు విద్యుత్ యూనిట్ ఇస్తే ప్రస్తుతం 8రూ॥లు వసూలు చేస్తున్నారన్నారు. పలుకేసుల్లో నిందితులంతా కొత్తపార్టీలో చేరుతూ ప్రజల సొమ్ము దోచుకునే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. మాజీ ఎంపీ బాలశౌరి ప్రాజెక్టు పేరుతో 6.93కోట్ల భూములను జిందాల్ కంపెనీకి 780కోట్లకు అమ్మేసి స్థానిక రైతుల నోట్లో మట్టికొట్టారన్నారు. సమాజాన్ని ు పాడేందుకు నీతి నిజాయితీ కలిగిన నాయకుల్ని చట్టసభలకు ఎన్నుకోవాలన్నారు. అవినీతి పరులకు అండగా వైయస్ కోట్లరూపాయల్ని కట్టబెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు ముసుకూరు బాలిరెడ్డి జిల్లా నాయకులు రమేష్‌కుమార్, సహకార సంఘం అధ్యక్షులు విశ్వమోహన్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, పార్టీ ఉపాధ్యక్షులు రమణారెడ్డి, వేణుంబాక శేషాద్రిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# స్వలింగసంపర్కుల హక్కులను కాలరాయొద్దు

స్వలింగ సంపర్కులకు వ్యతిరేకంగా ఐపీసీ 377చట్టాన్ని ప్రవేశపెట్టారని, ఆ చట్టాన్ని రద్దుచేయాలని నెల్లూరుజిల్లా హిజ్రాల సంఘం అధ్యక్షురాలు ఆర్.అలేఖ్య కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేసారు. సోమవారం నెల్లూరు ప్రెస్‌క్లబ్‌లో విలేకర్లతో మాట్లాడారు. స్వలింగసంపర్కులు సమాజంలో జీవించేందుకు సమానహక్కులు కల్పించాలన్నారు. స్వలింగసంపర్కం నేరమని సుప్రీంకోర్టు పరిగణించడం హిజ్రాల జీవన హక్కులకు గొడ్డలి పెట్టువంటిదన్నారు.

స్వలింగసంపర్కం అనాదిగా వస్తున్నదేనన్నారు. సమాజంలో తాము మనుషులమేనని, తమను ప్రత్యేకంగా పరిగణించి విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో సమానహక్కులు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో చిట్టి, గిరిజ, కావ్య, వైష్ణవి, సమీర, మున్నీ, శాంతి, కనిష్మ పాల్గొన్నారు.


## మేషం



అశ్వని, భరణి, కృతికె 1 పాదము

వస్త్ర అభరణ ఫ్యాన్సీ హోటల్ వాణిజ్యాలకు ఆదాయం పెరుగుతుంది. ఇతర వర్గాలకు ఆర్థికస్థితి సంతృప్తికరం. కళాక్రీడా సాంకేతిక రంగాలవారికి ప్రోత్సా హకరంగా ఉంటుంది. ఉద్యోగులకు పని సామర్థ్యము, అధికారుల సహకారము బాగుంటుంది. కోర్టు వ్యవహా లలో అనుకూలత, రావలసిన బాకీలు నిలబడి పోవడం ఉంటుంది. ఉద్యోగార్థులకు అవకాశాలు దొరుకుతాయి.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశిర్ష1, 2పాదాలు

వ్యాపార వర్గాలవారికి కొంత ఆర్థిక ఇబ్బంది ఉంటాయి. ఆదాయమునకు ధీటుగా ఖర్చులు పెరుగుతాయి. గడిచిపోయిన విషయాలను మరల ముం దుకు తెచ్చి విభేదాలు పెంచుకొనే స్థితి ఉన్నది కాబట్టి బంధువులతో జాగ్రత్తగా ఉండండి. షేర్ మార్కెట్ లాభా లలో ఉంటుంది. అనుకున్న పనులను పట్టుదలగా సాధిం చుకొంటారు. వివాహ ప్రయత్నాలు ఫలించగలవు.


## మిధునం



మృగశిర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఆర్థికంగా పుంజుకుంటారు. వృత్తి వ్యాపారాలలో మంచి అవకాశాలు, రాబడి బాగుంటుంది. మీ సలహా సూచనలు ఇతరులకు మేలు కలిగిస్తాయి. శుభకార్యాల విషయాలలో శ్రద్ధ చూపుతారు. కొత్త పెట్టుబడులు, కొత్త కాంట్రాక్టులు దొరుకును. ఆటంకాలను అధిగమించి అనుకున్న పనులు జరుగుతాయి. ఉద్యోగార్థులకు ఇం టర్వ్యూ అవకాశాలు రాగలవు.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

వృత్తి వ్యాపారాలలో మీ ప్రణాళికలు, పథకాల ద్వారా ప్రజలను ఆకర్షిస్తారు. ఆదాయం పెరుగుతుంది. అను కున్న పనులు నెరవేర్చుకొనడానికి తీవ్రంగా కృషి చేస్తారు. పెండింగ్ వ్యవహారాలు మరల అనుకూలంగా మార తాయి. బుధ, గురువారాలలో ఖర్చులు అదనంగా ఉం టాయి. ఉద్యోగులు అధికారులతోను, పబ్లిక్‌తోను జాగ్రత్త మెలగవలసి ఉంటుంది. ప్రభుత్వ అనుమతులు పెండిం గ్‌లో పడే అవకాశమున్నది.

బ్రహ్మశ్రీ

స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు



# రాశి - మీ వాసి

**తేది. 20.12.2013 నుండి తేది. 26.12.2013 వరకు**

ఈ వారం మేషంలో కేతువు, మిధునంలో గురువు, కర్కాటక సింహ కన్య రాశులలో చంద్రుడు, కన్యలో కుజుడు, తులలో శని రాహువులు, మకరంలో శుక్రుడు, ధనుస్సులో రవి బుధులు సంచరిస్తారు.

## పంచాంగము

తేది 25 బుధవారం క్రిస్‌మస్


## ముహూర్తములు

తేదీ 20 శుక్రవారం ఉదయము గంట 8.30 నుండి 10.30లోగా మకరలగ్నమున వ్యాపార ఉపనయన అక్షరాభ్యాసము మొదలగునవి.

## మార్గశీర్ష మాస కృష్ణ పక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 20 | శుక్ర | తదియ | రా॥గం.7.30వ॥ |
| తేది. 21 | శని | చతుర్థి | రా॥గం.9.11వ॥ |
| తేది. 22 | ఆది | పంచమి | రా॥గం.11.33వ॥ |
| తేది. 23 | సోమ | షష్ఠి | రా॥గం.1.00వ॥ |
| తేది. 24 | మంగళ | సప్తమి | రా॥గం.2.03వ॥ |
| తేది. 25 | బుధ | అష్టమి | రా॥గం.2.30వ॥ |
| తేది. 26 | గురు | నవమి | రా॥గం.2.30వ॥ |


## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

క్రొత్త పెట్టుబడులకు, నూతన వ్యాపారాలకు అవకా శాలు కలసి వస్తాయి. ఆదాయం స్వల్పంగా పెరుగు తుంది. బ్యాంక్ ఋణాలు మంజూరు కావడం, ప్రభుత్వ అనుమతులు లభించగలవు. లీజులు, టెండర్లకు అనుకూలత సమయం. అనుకున్న పనులను సమర్థ వంతంగా జరుపుకొంటారు. ఉద్యోగార్థులకు అవకాశాలు రాగలవు. అనుకోని ప్రయాణాలుంటాయి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

ఆర్థికంగా పెద్ద ఇబ్బందులుండకపోవచ్చును. వృత్తి పరంగా ప్రాముఖ్యం వ్యాపార రంగాల వారికి అభివృద్ధి ఆదాయం ఉంటుంది. తొందర పాటు వ్యవహారాలు చేయకుండా ఆలోచించి నిర్ణయాలు వేయండి. ఇంటా బయట ఆర్థిక వ్యవహారాలు జరిపేటప్పుడు జాగ్రత్త అవ సరం. ముఖ్య పత్రాలు, డబ్బు జాగ్రత్త పరచుకోనాలి. కోర్టు వ్యవహారాలలో అనుకూలత బాగుంటుంది.


## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

నూతన పెట్టుబడులు, సంస్థల విస్తరణ, క్రొత్త సం స్థల ప్రారంభములకు అనుకూలము. బ్యాంక్ ఋణాలు, ప్రభుత్వ అనుమతులు లభించగలవు. వ్యాపారాలలో అభివృద్ధి ఆదాయం పెరగడం ఉంటుంది. సొంత పను లకు ఆటంకాలు కలిగినా అధిగమించి పూర్తి చేసుకొం టారు. కాని టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. కోర్టు కేసుల ందు అనుకూలత కలదు.


## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఆర్థిక వ్యవహారాలు, సొంత పనులను ఇతరులపై పుర మాయించవద్దు. స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా వేసు కొనడం మంచిది. యాజమానులకు పర్యవేక్షణతో సమస్య లుంటాయి. అదనపు ఖర్చులుండినా ఇబ్బందివుండదు. వృత్తి వ్యవహారాలవృద్ధి అవకాశాలు, ఆదాయము పెరుగుదల, వృత్తి ఉపాధి పథకాలందు ఉద్యోగులు రాణించడం ఉంటుంది. పనులు నిదానంగా జరుగుతుంటాయి.


## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

కొత్త పెట్టుబడులకు, భాగస్వామ్య వ్యాపారాలకు అవకాశాలు అందగలవు. ఆదాయం పెరుగుతుంది. వృత్తి జీవనంలో కొత్త నిర్ణయాలు, పలుకుబడి పెరగడం, రాబడి పెరగడం జరుగుతుంది. శుభకార్యాలు నిర్ణయింతా గలవు. పెద్ద పెట్టుబడుల పై లాభాలుంటాయి. ప్రముఖు లతో పరిచయాలు కలగడం, స్థిరాస్తుల క్రయవిక్ర యాలు ఖరారు కావడం జరుగుతుంది.


## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

గడిచిన విషయాలపై నెలికితీసి మిమ్మల్ని విమ ర్శించే వారుంటారు. ఆర్థిక వ్యవహారాలలో, లౌకిక ఒప్పం దాలలో తొందరపడవద్దు. వ్యాపార వృద్ధి అవకాశాలు సన్నగిల్లుతాయి. ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కాగ లవు. కోర్టు కేసులు వాయిదా పడతాయి. ఉద్యోగులకు సామర్థ్యం ఉంటుంది మరియు అదనపు పనులు పైన బడగలవు. రాజకీయ పలుకుబడి బాగుంటుంది.


## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

సొంత పనులు వ్యవహారాలను సమయ స్ఫూర్తితో నిర్వహించవలసి ఉంటుంది. ఆర్థికావకాశాలు, వ్యాపార వృద్ధి ప్రయత్నాలు వెనుకబడతాయి. ఖర్చులు అదనంగా ఉండిన, ఇబ్బందులు ఉండకపోవచ్చును. ఉద్యోగులకు మిత్ర బంధు, అధికారుల సహకారముంటుంది. దైవ, సేవా కార్యాలలో పాల్గొంటారు. సెన్సెక్స్ రాబడి సంతృప్తిగ ఉండదు.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

వృత్తి ఉపాధి వర్గాల వారికి ఆదాయం పెరుగుతు ంది. వ్యాపార రంగాల వారికి మంచి ఆర్థికావకాశాలు ంటాయి. అదనపు ఖర్చులు తప్పవు, అయినాలోటు ఏమీ ఉండదు. ఉద్యోగులకు బాధ్యతల నిర్వహణలో తీరిక ఉండదు. అయినా అధికారుల సహకారం బాగుంటుంది. అనుకున్న పనులు నిదానంగా సానుకూలం కాగ లవు. మిమ్మల్ని విమర్శించేవారు మీకు చేరువకాగలరు.

# కేటుగాళ్ళు అరెస్టు

## 3లక్షలు విలువగల సొత్తు స్వాధీనం

వీళ్ళు యమకేటుగాళ్ళు..పోలీసు స్టేషన్లో కేసులు నమోదై వున్నాయి. ఈ మధ్యనే జైలు నుంచి విడుదలై మళ్ళీ పాత చోరీకళనే ప్రదర్శించారు. పట్టణాలు, నగరాల్లో కేసులుండడంతో జిల్లా చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో కన్నేశారు. రాత్రిళ్ళు పోలీసులు నిఘా వుండడంతో పట్టపగలే చోరీలకు పాల్పడ్డారు. కాని ఐడిపార్టీ చాక చక్యంగా పన్నిన వలలో పడి ఇరుక్కు పోయారు. వాళ్ళుచేసిన ఘనకార్యాలను నెల్లూరు డిఎస్పీ వియస్ రాంబాబు ఆది వారం విలేకర్లకు తెలిపారు. నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం అంబేడ్కర్ నగర్‌కు చెందిన యశోదమ్మ ఇంట్లో ఈ ఏడాది జూలై 31వతేదీ రాత్రి బంగారం, వెండి నగలు చోరీకి గురయ్యాయి. నవంబర్ 25వతేది పట్ట పగలు కూరగాయల మార్కెట్టు వీధి లోని ఓ ఇంట్లో బంగారు నగలు మాయ మయ్యాయి. నవంబర్ 30వతేదీ కాశీ పాలేనికి చెందిన గుత్తికొండ లక్ష్మీనారా యణ ఇంట్లో ఆరున్నర సవర్ల బంగారు నగలు చోరీకి గురయ్యాయి.

ఈ క్రమంలో నెల్లూరుకు చెందిన కేటుగాళ్ళు సుల్తాన్‌పలి, గయాజ్ అనే పాతనేరస్తులు జొన్నవాడ వద్ద అనుమా నాస్పదంగా సంచరిస్తుండగా వీరిని అదుపు లోకి తీసుకుని విచారించగా వారి వద్ద బంగారు, వెండి ఆభరణాలు దొరికాయి. మూడు చోరీలు చేసిన విషయాన్ని ఒప్పు కున్నారు. వీరిపై ప్రకాశం జిల్లా కనిగిరితో పాటు నెల్లూరు సిసియస్, బాలాజీనగర్, నెల్లూరు 3వపట్టణ పోలీస్‌స్టేషన్‌లో కూడా కేసులు నమోదై వున్నట్లు డిఎస్పీ వివ రించారు.

కోవూరు బైపాస్ రోడ్డులోని సాయి బాబా మందిరంలో 15కిలోల వెండిని చోరీచేసిన కేసు కూడా నమోదైందన్నారు. వీరివద్ద నుంచి 3లక్షల విలువచేసే బంగారు వెండి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి కోర్టుకు తరలించినట్లు తెలిపారు.

అంతర్ జిల్లా కేటుగాళ్ళను పట్టు కున్నందుకు జిల్లా ఎస్పీ రామకృష్ణ బుచ్చిరెడ్డిపాలెం పోలీసులకు రివార్డులు ప్రకటించారు.



వైకాపా స్టీరింగ్ కమిటీ జిల్లా సభ్యులు పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి మేనకోడలు మౌనిక - శివచరణ్‌రెడ్డి ల కల్యాణం ఈ నెల 11న నెల్లూరులో జరుగగా, రిసెప్షన్ వేడుకలు ఈ నెల 15వ తేదీన హైదరాబాద్‌లో ఘనంగా జరిగాయి. ఈ వేడుకకు వైకాపా అధ్యక్షులు వై.యస్.జగన్మోహన్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు.





కాంట్రాక్టర్ తుమ్మల శ్రీనివాసరావు - వరలక్ష్మిల కుమార్తె డా॥ భార్గవిదేవి - వెంకటేశ్వర్లు (అనంతసాగరం మండలం పడమటికంభంపాడు వాస్తవ్యులు పోతినేని కృష్ణయ్య కుమారుడు)ల వివాహం ఈ నెల 13వ తేదీ అచ్యుత సుబ్రహ్మణ్యం కల్యాణ మండపంలో జరిగింది. వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.



పార్లమెంటులో తెలంగాణ బిల్లును వ్యతిరేకించాలని డిఎంకె, అన్నా డిఎంకె పార్టీల అధినేతలను కలవడానికి ఇటీవల చెన్నైకు వచ్చిన వైకాపా అధినేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డిని కలిసి అభినందిస్తున్న తమిళనాడు తెలుగు యువశక్తి అధ్యక్షులు కేతిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి.

## ప్లాస్టిక్

(2వ పేజీ తరువాయి)

ఇవెంత డేంజరో చెప్పనక్కర్లేదు. ఇక వీధుల్లో వేసే చెత్తలో సగం వ్యర్థాలు ఈ పాలిథిన్ కవర్లే. పశువులు వీటిని తిని ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నాయి. పాలిథిన్ కవర్లు పూర్తి రసాయనాలమయం. వీటిని వాడితే రోగాలను కొని తెచ్చుకున్నట్లే!

ప్లాస్టిక్ వాడకంపై ప్రజలను చైతన్యవంతం చేయాల్సి వుంది. ప్లాస్టిక్‌తో వచ్చే ప్రమాదాలపై ప్రచారం నిర్వహించాల్సివుంది.

## మాగుంట ఒంగోలా? నెల్లూరా?



సీమాంధ్ర కాంగ్రెస్ ఎంపీలు చాలామంది పార్టీలు మారక తప్పదు. వీరిలో ఎక్కువమంది తెలుగుదేశం వైపు చూస్తున్నట్లు తెలుస్తుంది. ఎందుకంటే సీట్లు ఇవ్వగలిగింది ఇప్పుడు తెలుగుదేశం పార్టీయే. ఈ పరంపరలో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి కూడా కాంగ్రెస్‌ను వీడి తెలుగుదేశంలో చేరడం ఖాయంగా కనిపిస్తుంది. అయితే ఆయన ఏ నియోజకవర్గం నుండి పోటీ చేస్తాడనేది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. 1992 నుండి కూడా మాగుంట కుటుంబం ఒంగోలుకే అంకితమైవుంది. ప్రకాశం జిల్లాలో ఈ కుటుంబానికి మంచి సంబంధాలున్నాయి. కాబట్టి తెలుగుదేశంలో చేరినా కూడా ఒంగోలును వదలరనే ప్రచారం వుంది. ఒంగోలు లోక్‌సభ నుండి తెలుగుదేశం అభ్యర్థిగా మాగుంట శీనయ్య పేరు ప్రచారంలో వుంది. అయితే నెల్లూరు పార్లమెంట్‌కు కూడా శీనయ్య పేరు వినిపిస్తుంది. నెల్లూరు పార్లమెంట్‌కు తెలుగుదేశం అభ్యర్థిగా ఎవరూ ముందుకు రావడం లేదు. గత రెండుసార్లు లోక్‌సభకు పోటీ చేసి ఓడిపోయిన వంటేరు వేణుగోపాలరెడ్డి పార్టీకి దూరంగా ఉంటున్నాడు. సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అసెంబ్లీ నుండి పోటీకే ఆసక్తి చూపుతున్నారు. పార్టీలో ఇంకెవరూ లోక్‌సభకు ముందుకు రావడం లేదు. ఈ నేపథ్యంలో పూహించని అతిథిగా పార్టీలోకి రాబోతున్న మాగుంట శీనయ్యను నెల్లూరు లోక్‌సభకు పోటీ పెట్టాలనే ఆలోచనలో ఆ పార్టీ నాయకత్వం వున్నట్లు తెలుస్తుంది.

## తెలంగాణ ఎక్స్‌ప్రెస్

(మొదటిపేజీ తరువాయి)

హడావిడిగా తెలంగాణ బిల్లును తయారుచేసారు. ఈ బిల్లును తయారు చేయడంలో కనీస విచక్షణాజ్ఞానం మరిచారు. బిల్లులోని ప్రతి అంశంలో సీమాంధ్రకు ద్రోహం చేస్తున్న ఛాయలు చాలాస్పష్టంగా కనిపిస్తున్నాయి. బిల్లులో ఎక్కడా సీమాంధ్రకు ఒక్క నిర్దిష్ట హామీ ఇవ్వలేదు. ప్రతి ప్రాజెక్టును కూడా అధ్యయనం చేస్తాం, పరిశీలిస్తామని పేర్కొన్నారంతే. పూర్తి ఏకపక్షంగా తెలంగాణ బిల్లును తయారుచేసారు. బిల్లు ప్రతులను ప్రాంతీయ భాషలో ప్రచురించాలన్న ఇంగితజ్ఞానం కూడా మరిచారు. హడావిడిగా హోం శాఖ కార్యదర్శి చేత స్పెషల్ ఫ్లైట్‌లో మన రాష్ట్రానికి పంపించారు.

తెలంగాణ బిల్లు వచ్చేసింది కాబట్టి అసెంబ్లీలో వెంటనే చర్చకు పెట్టాలని తెలంగాణ ఎమ్మెల్యేలు డిమాండ్ చేస్తే, కొంత కాలయాపన చేయాలని సీమాంధ్ర ఎమ్మెల్యేలు భావించారు. అయితే ఇక్కడ తెలంగాణవాళ్లదే పైచేయి అయ్యింది. అసెంబ్లీలో బిల్లు చర్చకు వచ్చేలా కేంద్రం ముందుగానే గేమ్ ప్లాన్‌ను సిద్ధం చేసి పంపింది. ముఖ్యమంత్రిని, శాసనసభలో కీలకపాత్ర పోషించే స్పీకర్‌ను కంట్రోల్‌లో పెట్టుకుని వారికి ఎలా వ్యవహరించాలనే దానిపై ముందుగానే సూచనలు జారీ చేసింది. కేంద్రం ఆదేశాలకు అనుగుణంగానే స్పీకర్ నడుచుకున్నారు. బిల్లు వచ్చినరోజే సీఎం శాసనసభకు గైర్హాజరు కావడం ద్వారా అసెంబ్లీలో బిల్లుపై చర్చకు మార్గం సుగమం చేసారు. సిడబ్ల్యుసి ఆమోదంతో మొదలైన రాష్ట్ర విభజన ప్రక్రియ కేంద్ర కేబినెట్ ఆమోదంతో పరుగందుకుంది. ఇప్పుడు రాష్ట్ర శాసనసభలో చర్చకు రావడం ద్వారా తెలంగాణ బిల్లును పట్టాలెక్కించినట్లయ్యింది. ఈ బిల్లుపై చర్చించి ఆరువారాల్లోగా తనకు పంపాలని రాష్ట్రపతి గడువు విధించి వున్నారు. అసెంబ్లీలో చర్చ మొదలైందని ప్రకటించారేగాని ఇంతవరకు అర్థవంతమైన చర్చ ప్రారంభం కాలేదు. తెలంగాణబిల్లుపై 294శాసన సభ్యులు, శాసనమండలిలో 90మంది సభ్యులు తమ అభిప్రాయాలను తెలియజేయాల్సివుంది. ఇది సుదీర్ఘంగా జరిగే ప్రక్రియ. కాబట్టి మరికొంత గడువు కోరాలని సీమాంధ్ర నేతలు భావిస్తున్నారు. రాష్ట్రపతి ఇచ్చిన గడువులోపు చర్చ పూర్తిచేసి బిల్లును పంపించాలనేది తెలంగాణ నేతల తొందర. బిల్లుపై అభిప్రాయాలే చెప్పాలా? లేక ఓటింగ్ జరపాలా అనేదానిపై కూడా ఇంతవరకు స్పష్టతలేదు. బిల్లు రాష్ట్రపతికి పంపితే ఆ తర్వాత పార్లమెంట్‌కు పంపాలి. ఈ శీతాకాల పార్లమెంటు సమావేశాలు ముగిసాయి. ఇక తెలంగాణ బిల్లు కోసం ప్రత్యేక సమావేశాలు పెట్టాల్సిందే! రాష్ట్ర శాసనసభ నుండి రాష్ట్రపతి వద్దకు బిల్లు పోతే ఒక అంకం పూర్తయినట్లే. రెండో అంకం పార్లమెంటు చాలా కీలకం. సీమాంధ్ర సమస్యలు తర్వాత చూద్దాం... వాళ్లెక్కడ ఛస్తే మనకేంటి... తెలంగాణ బిల్లు పెట్టండి... మేం ఆమోదింపజేస్తాం అని కాంగ్రెస్, బీజేపీలు సిద్ధంగా ఉన్నాయి. కాబట్టి పార్లమెంటులో తెలంగాణబిల్లు పాస్ కావడమనేది లాంఛనమే. పార్లమెంటు ఆమోదిస్తే మూడో అంకంలో రాష్ట్రపతి ఆమోదముద్ర లాంఛనమే అవుతుంది.

## మ్యాచ్ ఫిక్సింగ్


(మొదటిపేజీ తరువాయి)

అని ఆ పోలీస్ అంటాడు. అప్పుడా డాన్ ఆ పోలీసు కూతురును కిడ్నాప్ చేస్తాడు. నీ కుతురు కావాలంటే నా అనుచరులను వదలాలని కండీషన్ పెడతాడు. ఇంకేముంది ఎస్పీ సిన్సియార్టీ అంతా వెత్తబుట్టలో పడుతుంది. తన బిడ్డ కోసం స్వధర్మను వదలాల్సి వస్తుంది. ఈ తరహా సంఘటనే కిరణ్ విషయంలోనూ జరిగిందా అనే అనుమానాలు లేకపోలేదు. సిబిఐని అడ్డం పెట్టుకుని కాంగ్రెస్‌వాళ్లు ఇప్పటికే రాజకీయ ప్రత్యర్థులను ముప్పతిప్పలు పెడుతున్నారు. హైదరాబాద్ వచ్చిన దిగ్విజయ్ కూడా కిరణ్‌ను ఆ కోణంలోనే బెదిరించి లొంగదీసుకున్నాడా అనేది అనుమానం. కిరణ్‌పై ప్రత్యక్షంగా ఎలాంటి అవినీతి ఆరోపణలు లేకున్నా ఆయన తమ్ముళ్లను టార్గెట్ చేసుకుని బెదిరించారనే గుసగుసలు వినిపిస్తున్నాయి.


ఏదేమైనా విభజన విషయంలో కిరణ్ మ్యాచ్ ఫిక్సింగ్‌లకు తలొంచకుండా దేశం కోసం ఆడిన సచిన్ లాంటి హీరో అవుతాడనుకుంటే, అధిష్ఠానానికి లొంగి క్రికెట్ క్రీడాపరువు తీసిన శ్రీశాంత్‌లా అయ్యాడు.

## పక్షుల పండుగతో సరి...
## పర్యాటక ప్రగతి ఇంతేనా మరి!









ఏడాదికోసారి ఫ్లెమింగో ఫెస్టివల్‌ను నిర్వహించడం, జిల్లాలో పర్యాటక రంగ అభివృద్ధికి చెమటకార్చుతూ కృషి చేస్తున్నామని చెప్పుకోవడం ప్రజాప్రతినిధులకు పరిపాటయ్యింది. జిల్లాలో పర్యాటక అంశమంటే ఏడాదికోసారి పక్షులపండుగ నిర్వహించడమే అన్నట్లుగా పరిస్థితి వుంది. సంవత్సరానికోసారి పర్యాటకులు రావడం, పర్యాటక కేంద్రాలను చూడడం కాదు, సంవత్సరం పొడవునా పర్యాటకులు వచ్చే విధంగా సౌకర్యాలు ఉంటేనే అవి మంచి పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చెందుతాయి. ఈ సీజన్‌లో నేలపట్టు, పులికాట్‌లకు విదేశీ విహంగాలు వస్తుంటాయి. కాబట్టి జనవరిలో వీటి కోసం ఫ్లెమింగో ఫెస్టివల్‌ను నిర్వహిస్తున్నారు. ఇక్కడ కొన్ని నెలలు మాత్రమే పక్షులను చూడగలం. పులికాట్ సరస్సుకు ఈ ఫ్లెమింగో ఫెస్టివల్ జరిగే రెండురోజుల్లో మాత్రమే పర్యాటకులు వస్తుంటారు. ఏడాది పొడవునా ఇక్కడ బోటింగ్ ఏర్పాటు చేస్తే పర్యాటకుల సంఖ్య పెరిగే అవకాశముంటుంది.

జిల్లాలో సోమశిల, కండ్లేరు రిజర్వాయర్‌లను మంచి పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేసుకోవచ్చు. రిజర్వాయర్‌లలో బోటింగ్, అతిథి గృహాలు వంటి సౌకర్యాలు ఏర్పాటు చేస్తే పర్యాటకుల సంఖ్య పెరిగే అవకాశముంది. అలాగే పెంచలకోన ప్రకృతి రమణీయంగా వుంటుంది. ఉదయగిరి కొండ, మైపాడు, కొత్తకోడూరు బీచ్ వంటి వాటిని పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దడంపై జిల్లా మంత్రి దృష్టిపెట్టాలి.

## ఇది నీ పుణ్యమే

(మొదటిపేజీ తరువాయి)

బిల్లు కోసం ఆయన జాతినే చైతన్యపరిచి భారీస్థాయిలో ఉద్యమం నడిపారు. హజారే నడిపిన ఉద్యమాన్ని అవహేళన చేసిన వాళ్లు లేకపోలేదు. ముఖ్యంగా అవినీతికి కొమ్ముకాసే కాంగ్రెస్ నాయకులైతే ఆయనపైనే ఆరోపణలకు దిగారు. అవినీతి మసిని ఆయనకు కూడా అంటించాలని చూసారు. లోక్‌పాల్ బిల్లుతో అవినీతిని అంతమొందించలేమంటూ రాహుల్‌గాంధీ లాంటివాళ్లు సన్నాయి నొక్కులు నొక్కారు. పార్లమెంటులో పలు పార్టీలు లోక్‌పాల్ బిల్లును వ్యతిరేకించాయి.

అయితే మొన్నటి నాలుగు రాష్ట్రాల ఎన్నికలలో కాంగ్రెస్ చావుదెబ్బ తింది. అవినీతి వ్యతిరేక ఫలితాలే అవి. ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ విజయంతో ప్రజలు ఏం కోరుకుంటున్నారనేది కేంద్ర ప్రభుత్వానికి అర్థమైపోయింది. అందుకే సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అటకెక్కించివున్న లోక్‌పాల్ బిల్లు దుమ్ము దులిపి పార్లమెంట్‌లో ప్రవేశపెట్టింది. రాజ్యసభలోనూ, లోక్‌సభలోనూ లోక్‌పాల్ బిల్లు ఆమోదం పొందింది.

లోక్‌పాల్ బిల్లు పరిధిలోకి ప్రధాని, మంత్రులు, ఎంపీలు, మాజీఎంపీలు, కేంద్రప్రభుత్వ ఉద్యోగులు వస్తారు. లోక్‌పాల్‌కు స్వతంత్ర దర్యాప్తు సంస్థ ఉంటుంది. నిజాయితీగల ఉద్యోగులకు భద్రత కల్పించడంతో పాటు తప్పుడు ఆరోపణలకు కూడా శిక్షలు తప్పవు. లోక్‌పాల్ కేసులో దోషులుగా నిర్ధారణయితే, గరిష్టంగా పదేళ్ల శిక్ష పడుతుంది. అయితే ఈ పార్లమెంటు ఆమోదించిన బిల్లు ఎంతవరకు పనితనం చూపుతుందన్న సందేహాలు లేకపోలేదు. ఇది అన్నా హజారే గతంలో ప్రతి పాదించిన బిల్లు కాదు. స్వల్ప మార్పులతో కేంద్రం రూపొందించిన బిల్లే! ఇదెంత వరకు అవినీతిని అరికట్టగలదో చూడాలి.

PDF Compressor Free Version






## 'పైసా' మరో 'ఖడ్గం'


ఎన్నో అవాంతరాల మధ్య నిర్మాణం పూర్తి చేసుకున్న 'పైసా' సినిమా 'ఖడ్గం'లాగా విజయం సాధిస్తుందని ఆ సినిమా హీరో నాని అభిప్రాయ పడుతున్నాడు. కృష్ణవంశీ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఆయన తీసిన 'ఖడ్గం' కంటే గొప్పగా వుంటుందని చెప్పుకొచ్చాడు. త్వరలో ఈ సినిమా విడుదలకానుండడంతో ఈ సినిమాను ప్రమోట్ చేసే కార్యక్రమాలతో నాని బిజీగా వున్నాడు.

## మూ'వీ'క్షణం




## ఊపుతున్న 'ఉయ్యాలా జంపాలా'

సాధారణంగా భారీ బడ్జెట్ సినిమాలకు, పెద్దహీరోల సినిమాలకు ప్రచారం ఎక్కువగా వస్తుంటుంది. కాని అందుకు భిన్నంగా చాలా చిన్నబడ్జెట్‌తో తెరకెక్కించిన రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'ఉయ్యాలా జంపాలా'కు మంచి క్రేజ్ వచ్చింది. 'చిన్నారి పెళ్ళికూతురు' సీరియల్ ద్వారా ఫేమస్ అయిన అవికాగౌర్ ఈ సినిమాలో హీరోయిన్‌గా కనిపించనుండడం ఈ క్రేజ్‌కు ఓ కారణమైతే యువసామ్రాట్ నాగార్జున ప్రత్యేక ప్రచారం నిర్వహిస్తుండడం మరో ఆసక్తికర అంశం.



## జీవితమే ఓ అద్భుతం

ప్రతిమనిషి జీవితంలో ఓ అద్భుతం జరుగుతుంటుందని సూపర్‌స్టార్ రజనీకాంత్ నమ్ముతున్నారు. ఇటీవల ఓ ప్రముఖటీవీ ఛానెల్ నిర్వహించిన అవార్డు వేడుకల్లో ఆయన ఓ గౌరవ ప్రదమైన అవార్డు అందుకుని మాట్లాడుతూ తాను సాదాసీదా బస్సు కండెక్టర్‌నని, తాను సూపర్ స్టార్‌గా ఎదగడమే ఓ అద్భుతమని, కష్టపడే వారికి ఇలాంటి మిరాకిల్స్ జరుగుతుంటాయన్నారాయన.



## చెల్లికి పెళ్ళి

ఈ నెల 28వ తేదీ కోసం కాజల్ అగర్వాల్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తుంది. దానికి కారణం ఆరోజు ఆమె చెల్లి నిషా అగర్వాల్‌కు ముంబైకు చెందిన వ్యాపారవేత్త కరణ్‌వలేచాతో వివాహం జరుగనుంది. తన చెల్లెలు పెళ్ళి చేసుకుని ఓ ఇంటిదైపోతున్నందుకు ఆమె ఆనంద పడుతుంది. నా కుటుంబ జీవితంలో ఇది మరచిపోలేని రోజంటుంది. మరి ఆమె పెళ్ళెప్పుడో?



## అతని ముద్ర

సముద్రఖని దర్శకత్వంలో రూపొందుతున్న 'జెండాపై కపిరాజు' చిత్రంలో అమలాపాల్ హీరోయిన్‌గా నటిస్తుండడం తెలిసిందే! సముద్రఖనికి సామాజిక స్పృహ ఎక్కువని, ఆయన ఆలోచనలు ఆసక్తి రేకెత్తించే విధంగా వుంటాయని, ఆయన పక్కన వున్నప్పుడు ఆయన భావాలు తనను చాలా ఇన్స్‌పైర్ చేసాయని అమలాపాల్ అంటుంది. అందుకే ఈ అమ్మడు సముద్రఖనికి అభిమానిగా మారిపోయిందట!

# గూడూరు డివిజన్ వార్తలు

## అంతర్ జిల్లా దొంగలు అరెస్టు

### 2లక్షల సొత్తు స్వాధీనం



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ కె.చౌడేశ్వరి

అంతర్ జిల్లా దొంగలు ఇద్దరిని అరెస్టు చేసినట్లు గూడూరు డీఎస్పీ చౌడేశ్వరి తన కార్యాలయంలో సోమవారం నాడు వెల్లడించారు. గూడూరు డిఎస్పీ కథనం మేరకు ఈనెల 11న గమళ్లపాలెంలో నందిపూడి చక్రధర్ సింగ్ ఇంట్లో చోరీ జరిగింది. ఎస్.ఐ షరీఫ్, సిబ్బంది బృందంగా ఏర్పడి చోరుల కోసం అన్వేషిస్తున్నారు. ఆదివారం సాయంత్రం తాళమ్మగుడి పక్కన చల్ల కాలువ వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఇద్దరిని 1వ పట్టణ ఎస్సై అదుపులోకి తీసుకున్నారు. వారిద్దరూ గూడూరుకు చెందిన కొల్లపూడి వెంకయ్య అలియాస్ బట్టోడు, పందిటి వెంకటేష్ అలియాస్ మట్టోడుగా విచారణలో తేలింది. వారి వద్ద 2లక్షల విలువైన బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు డిఎస్పీ వెల్లడించారు. గతంలో వారిపై 16 దొంగతనం కేసులు, ఆరు కొట్లాట కేసులు ఉన్నట్లు చెప్పారు. కంచి శ్రీహరికి చెందిన లారీల బ్యాటరీలనూ చోరీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ కేసులో నిందితుల వద్ద 7బ్యాటరీలను స్వాధీనం చేసుకున్నామన్నారు. విలేకర్ల సమావేశంలో గూడూరు పట్టణ సిఐ రవికుమార్, 1వపట్టణ ఎస్.ఐ షేక్ షరీఫ్, ఎ.ఎస్.ఐ వీరనారాయణ, సి.ఐ శ్రీనివాసులురెడ్డి కానిస్టేబుల్ మోహన్‌కృష్ణ, మస్తానయ్య పాల్గొన్నారు.

## సర్వేను సక్రమంగా చేయండి



తహాశీల్దార్ మైత్రేయకు విన్నవిస్తున్న అర్జీదారులు

గూడూరు తహాశీల్దార్ కార్యాలయంలో ప్రజావిజ్ఞప్తుల దినం సోమవారంనాడు జరిగింది. పట్టణంలో పంపిణీచేసిన ఇందిరమ్మ నివేశనస్థలాల్లో పట్టాలు పొందినవారు ఉన్నారా లేదా అనే విషయమై జరిపిస్తున్న సర్వేను సక్రమంగా నిర్వహించాలని మాజీ కౌన్సిలర్లు తహాశీల్దార్లు మైత్రేయకు విన్నవించుకొన్నారు. తహాశీల్దార్ కార్యాలయంలో ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. పట్టణంలో పలు వార్డులకు చెందిన లబ్ధిదారులు ఈ సందర్భంగా ఆందోళన వ్యక్తంచేశారు. గతంలో అద్దె గృహాల్లో కాపురం ఉంటున్న లబ్ధిదారులమైన తమకు నివేశనస్థలాల పట్టాలిచ్చారని, తాజాగా సర్వే జరిగిన సమయంలో వేరే చోట ఉండటంతో అనర్హుల జాబితాలో చేర్చనున్నారని వాపోయారు. గత పరిశీలన సక్రమంగా జరిగిందని, తాజా సర్వేలో ఆ వివరాలను పరిగణలోకి తీసుకొని తమకు అన్యాయం జరగకుండా చూడాలని లబ్ధిదారులు తహాశీల్దార్‌కు విన్నవించుకొన్నారు. సోమవారంనాడు రేషన్‌కూపన్ల కోసం వచ్చిన వారితో కార్యాలయం కిక్కిరిసింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహాశీల్దార్ సుకుమార్, ఏవో వేణుగోపాల్‌రావు, గృహనిర్మాణశాఖ ఏ.ఇ చంద్రశేఖరరాజు తదితరులు పాల్గొన్నారు.

## జెడ్పీ హైస్కూల్ గేటుకు విరాళం



పాఠశాలగేటును ప్రారంభిస్తున్న సీటీవో లక్ష్మీమాధవి

గూడూరు, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధాన ద్వారానికి కోట సుబ్రహ్మణ్యం జ్ఞాపకార్థం ఆయన కుమారుడు కోట ప్రకాశం లక్ష రూపాయలు వెచ్చించి నిర్మించిన గేటును సోమవారంనాడు సీటీవో లక్ష్మీమాధవి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కోటసునీల్, ప్రధానోపాధ్యాయులు ఇస్మాయిల్, షేక్ రియాజ్‌అహ్మద్, దశరథరామిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా ట్రాక్టర్లతో ర్యాలీ

రాష్ట్ర విభజనను నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ 14వ తేదీ వైకాపా అధ్వర్యంలో గూడూరు పట్టణంలో ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. కేవలం ఓట్లు సీట్లు కోసమే రాష్ట్రవిభజన ప్రక్రియను వేగవంతం చేస్తోందని, అదే సమయంలో సీమాంధ్ర ప్రజల మనోభావాలను పట్టించుకోవడంలేదని అన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్‌కు ప్రజలు గుణపాఠం చెబుతారని అన్నారు.

## భూములిచ్చేందుకు... అధికారులు చొరవచూపాలి

అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ భూములను పంపిణీచేయాలని ఎమ్మెల్యే బల్లి దుర్గాప్రసాద్‌రావు అన్నారు. గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే అధ్యక్షతన అసైన్‌మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే సాగులో ఉన్న పేదలందర్నీ గుర్తించి వారికి భూములను ఇచ్చేందుకు అధికారులు చొరవచూపాలని అన్నారు. ఏడో విడతలో చిట్టమూరు మండలంలో 126.95ఎకరాలకుగాను 176మందిని ఎంపిక చేశామన్నారు. అలాగే కోట మండలంలో 70.05ఎకరాలను 50మందికి, వాకాడు మండలంలో 33.48ఎకరాలను 26మందికి పంపిణీ చేసేందుకు జాబితా సిద్ధం చేసినట్లు వివరించారు. చిల్లకూరు, గూడూరు మండలాల్లో కూడా మిగులు భూములను పంపిణీ చేసేందుకు గుర్తించాలని ఆయన కోరారు. గూడూరు ఆర్డీవో మాట్లాడుతూ భూవివాదాలను పరిష్కరించేందుకు సర్వే చేయించి ప్రభుత్వ భూములను గుర్తిస్తామన్నారు. సమావేశంలో తహాశీల్దార్లు, అసైన్‌మెంట్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు భూములివ్వాలి



ఆర్డీవో మధుసూదనరావుకు సమస్యను వివరిస్తున్న బాధితులు

భూమిలేని నిరుపేదలు కూలీలుగానే మిగిలిపోతున్నారని, ప్రభుత్వం పేదలకు భూములను పంపిణీచేసి ఆదుకోవాలని పలువురు ఆర్డీవో మధుసూదనరావును కలిసి విన్నవించారు. గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా విజ్ఞప్తుల దినం నిర్వహించారు. వాకాడు మండలం సిద్ధగుంటపాళెం గ్రామంలో గత 40ఏళ్ల నుంచి భూములను ఆక్రమించుకొని సాగుచేస్తున్నామని వాటికి పట్టాలు ఇవ్వకపోగా ఖాళీచేయాలని అధికారులు బెదిరిస్తున్నారంటూ బాధితులు విన్నవించారు. మరికొందరు పేదలు ఏదో విధంగా భూములను పంపిణీ చేయాలని ఆర్డీవోకి వినతిపత్రం అందించారు.

## పేదలకు దుస్తులు పంపిణీ

గూడూరు పట్టణంలోని హైస్కూల్ రోడ్డులోని మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యనిర్వాహకుడు చదలవాడ శ్రీనివాసులు భార్యాభర్తల అన్యోన్యతపై రచించిన పుస్తకాన్ని రోటరీ సభ్యులు కె.సుందరరామిరెడ్డి, చదలవాడ శేషయ్య, విశ్రాంత ఉద్యోగి కృష్ణమూర్తి చేతులమీదుగా ఆవిష్కరించారు. కళాకారుడు చదలవాడ శేషయ్య మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సాయం చేసే గుణం అలవరచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సారంగం శ్రీనివాసులు, మదనంబేటి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

PDF Compressor Free Version






Edited, Published, Printed & owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY**, Executive Editor-**G.SREENIVASULU REDDY**.